




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








ఆదిలాబాద్ | 29-10-2026 గురువారం | సంపుటి : 14 | సంచిక :47 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

Follow us on


## ఎర్రకోటపై జెండా ఎగురవేస్తారు: నితిన్ నబీన్

27-10-2026 మంగళవారం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ఎఎంఎస్) :**

2029 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి నరేంద్ర మోదీ మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపడతారని, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అంతిమ దశకు చేరుకుంటోందని విమర్శించారు. ఢిల్లీలోని చాందినీ చౌక్ ప్రాంతంలో భాజపా నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.. అరాచకాన్ని తొలగించాలి' నినాదంతో కూడిన ర్యాలీలో నితిన్ నబీన్ పాల్గొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఢిల్లీ భాజపా అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలతో కలిసి జైన్ లాల్ ఆలయం నుంచి టౌన్ హాల్ చౌక్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి నితిన్ నబీన్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదారులను తొలగించేందుకు భాజపా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ వ్యతిరేకించడంపై నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీకి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని ఆరోపించారు.

# రాజధానిలో తాగునీటి కొరతకు తావివ్వొద్దు



### మురుగునీటి శుద్ధి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలి
### నిర్మాణ పనులకు శుద్ధి చేసిన నీరే వినియోగించాలి
### తాగునీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ
### శుద్ధి చేసిన నీటి వినియోగంపై కఠిన నిబంధనలు
### నవంబరు ఒకటి నుంచి కొత్త ఆదేశాల అమలు
### ప్రతి శుద్ధి కేంద్రం పనితీరుపై ప్రత్యేక నిఘా

**హైదరాబాద్, అక్టోబర్ 28 (వుదయం) :**

రాజధాని హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలాశయాల్లో నీటి నిల్వలను నిరంతరం పరిశీలిస్తూ, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వినియోగం, మురుగు నీటి శుద్ధి, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ పరిధిలోని సమగ్ర పట్టణ ప్రాంతంలో తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలన్నీ నూరు శాతం సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, బాహ్య వలయ రహదారి, మెట్రో రైలు వ్యవస్థతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సూచించారు. ప్రజా ఉద్యానవనాల నిర్వహణ, రహదారుల శుభ్రత పనులకు సైతం ఈ నీటినే ఉపయోగించాలన్నారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలనే నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రైవేటు మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించడంతోపాటు, సమాచార నిల్వ కేంద్రాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. శుద్ధి కేంద్రాల నిర్వహణకు సౌర విద్యుత్తును ఉపయోగించే అవకాశాలను పరిశీలించాలని పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు సూచించారు.

మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని కేంద్రాలను నియంత్రణ, పర్యవేక్షణ కేంద్రంతో అనుసంధానించి నిరంతరం వాటి పనితీరును పరిశీలించాలని ఆదేశించారు.

ఈ కేంద్రాల నిర్వహణను హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్ల కదలికలను గుర్తించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి తెలిపారు. శుద్ధి చేసిన నీటి సరఫరా కోసం ప్రత్యేక ఉచిత ఫోన్ నంబరును అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శుద్ధి కేంద్రాల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబరు ఒకటో తేదీ నుంచి కొత్త ఆదేశాలు అమల్లోకి వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి శుద్ధి చేసిన నీటిని ఆకుపచ్చ రంగు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఖర్చులను మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూసీ ప్రక్షాళన పేరుతో రాష్ట్ర సంపద దోపిడీకి యత్నం

### ప్రజాభిప్రాయ సేకరణను ప్రైవేటు వ్యవహారంగా మార్చారు: దాసోజు

హైదరాబాద్: మూసీ ప్రక్షాళనపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రైవేటు వ్యవహారంగా మార్చారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపందలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికిన ప్రభుత్వం, తమ పార్టీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ప్రజాభిప్రాయ సేకరణకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. మూసీ నది సుధీర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం గుండా ప్రవహిస్తున్నప్పుడు ఆయనను అడ్డుకోవడం ఏమిటని నిలదీశారు. ఈ రోజు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ చట్టవిరుద్ధమని దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.7,300 కోట్ల రుణంతో మూసీ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారని పేర్కొన్నారు.

# డిజిటల్ అరెస్టుల ముసుగులో దోపిడీ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ఎఎంఎస్) :**

డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులు దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటువంటి నేరాలను డిజిటల్ దోపిడీగా అభివర్ణించిన ధర్మాసనం.. నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. విచారణ పూర్తికాకముందే శిక్షించే అవకాశం చట్టంలో ఉంటే దాన్ని వినియోగించుకోవాలని వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా తమపై నమోదైన కేసులన్నింటినీ ఒకేచోట చేర్చి విచారించాలంటూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. నిందితుల సౌలభ్యం కోసం బాధితులను, దర్యాప్తు సంస్థలను ఇబ్బందులకు గురిచేయలేమని తేల్చిచెప్పింది.

వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డిజిటల్ అరెస్టుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ముఠాలపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బాధితుల ప్రయోజనాలను పక్కనపెట్టి నిందితులకు వెసులుబాటు కల్పించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది.

కమీషన్ల కోసం తమ సంస్థల బ్యాంకు ఖాతాలను సైబర్ నేరాల ద్వారా సంపాదించిన సొమ్మును దాచేందుకు వినియోగించుకోవడానికి అనుమతించారనే ఆరోపణలపై నిధి భండారీ, గౌరబ్ సాహాలపై పలు కేసులు నమోదయ్యాయి. మొత్తం 12 రాష్ట్రాల్లో 30కి పైగా కేసులు ఉండటంతో, వాటన్నింటినీ ఒకచోట చేర్చి విచారించాలని వారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, ఈ అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది.

డిజిటల్ అరెస్టుల పేరుతో పెద్ద సంఖ్యలో ప్రజలను మోసం చేస్తున్న నిందితులకు ఎలాంటి ప్రత్యేక వెసులుబాట్లు కల్పించబోమని న్యాయస్థానం స్పష్టం చేసింది. నిందితుల సౌకర్యం కోసం బాధితులు లేదా దర్యాప్తు సంస్థలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించలేమని పేర్కొంది. దోపిడీ చేసిన సొమ్మును హాంకాంగ్, బ్యాంకాక్‌లలో జమ చేస్తే, న్యాయం కోసం బాధితులనే అక్కడికి వెళ్లమని చెప్పగలమా? అని ప్రశ్నించింది.

బాధితుల హక్కులను విస్మరించి నిందితుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వలేమని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో నిధి భండారీ, గౌరబ్ సాహాలు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ కేసులకు సంబంధించి ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, కేరళ సహా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి.

## పలు శాఖల్లో కీలక మార్పులు..

### 12 మంది అధికారుల స్థానచలనం

**హైదరాబాద్, అక్టోబర్ 28 (వుదయం) :**

తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనాపరమైన మార్పుల్లో భాగంగా ప్రభుత్వం 12 మంది సీనియర్ ఐఎఎస్ అధికారులను బదిలీ చేసింది. పలు కీలక శాఖలకు కొత్త అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేష్ రంజన్, విద్యుత్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్, క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వాణీ ప్రసాద్, పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నవీన్‌మిత్తల్‌ను నియమించింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌కు బాధ్యతలు అప్పగించింది. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగుతున్న దానకిశోర్ పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఇతర శాఖల్లోనూ కీలక బాధ్యతలను అధికారులకు కేటాయించింది. గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శిగా రాహుల్ బొజ్జాకు, కోర్ అర్బన్ రీజియన్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తిని నియమించింది. మహిళా సంక్షేమం, ఎస్సీ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శ్రుతి ఓజాకు బాధ్యతలు అప్పగించింది. వైద్యారోగ్యశాఖ సంచాలకుడిగా ముషారఫ్ అలీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండీగా ఉన్న జితేష్ పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలను అదనంగా అప్పగించింది.

## ఇంతే కదా...!











# గ్రేటర్ హైదరాబాద్





## రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్

**రామచంద్రపురం అక్టోబర్ 28 (వుదయం)**

హైదరాబాద్‌లో మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని రామచంద్రాపురం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం రామచంద్రాపురం డివిజన్‌లో నెలకొన్న పలు స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్‌లో చిన్నచిన్న అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. తగిన నిధులు మంజూరు చేస్తే డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని బూరుగడ్డ పుష్పనగేష్ మంత్రికి వివరించారు.

## నీరుడు సర్వేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేనలో చేరిన నరసింహారెడ్డి

- BRSకు గుడ్‌బై.. తెలంగాణ రక్షణ సేనలోకి నరసింహారెడ్డి!
- 123వ డివిజన్ హైదర్‌షాకోట్ నుంచి ప్రతి గడపకు పచ్చ జెండా పంచజన్యం

**గండిపేట్, అక్టోబర్ 28 (వుదయం):**

బీఆర్ఎస్ పార్టీని వీడిన నరసింహారెడ్డి, నీరుడు సర్వేష్ ముదిరాజ్, నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని 123వ డివిజన్ హైదర్‌షాకోట్ గ్రామం నుంచి పార్టీ పచ్చ జెండా పంచజన్యాన్ని ప్రతి గడపకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆశయాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.నియోజకవర్గంలోని ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను



తెలుసుకుని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ముందుకు సాగుతామని నాయకులు పేర్కొన్నారు. హైదర్‌షాకోట్ గ్రామంతో పాటు 123వ డివిజన్ పరిధిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి, ప్రతి ఇంటికీ తెలంగాణ రక్షణ సేన సందేశాన్ని చేరవేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర ఆత్మగౌరవం, ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నాయకులు, కార్యకర్తల సహకారంతో డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా "జై తెలంగాణ.. జై కవితమ్మ" అంటూ నినాదాలు చేస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.



## ఖర్గే దిష్టి బొమ్మను దగ్ధం చేసిన బిజెపి నాయకులు

**బాచుపల్లి, అక్టోబర్ 28 ,(వుదయం ప్రతినిధి ),**

భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు అనుక్షణం పనిచేస్తూ, దేశ సౌభాగ్యం కోసం కృషి చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ గురించి వారి తండ్రి గురించి పాట్నా సభలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు అన్నారు. మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నాయకులు భారతీయ జనతా పార్టీ నాయకులపై మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసేటప్పుడు కనీసం షూ కూడా తొలగించని అవివేకవంతుడు మల్లికార్జున కరిగే అని విమర్శించారు. నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ వద్ద బిజెపి నాయకులతో కలిసి ఖర్గే దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బండారి లే అవుట్ బీజేపీ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, బీజేపీ బిల్డర్ సెల్ జిల్లా కన్వీనర్ పద్మ ప్రసాద్, బీజేపీ నాయకులు కొంకి రాము, జోజప్ప, అంజి, కమలాకర్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**దుండిగల్, అక్టోబర్ 28,(వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు స్వామిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు స్వామి శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్, బాలకృష్ణ రెడ్డి, పోలీస్ గోవింద్ రెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూసెన్స్‌కు పాల్పడిన ముగ్గురికి స్వచ్ఛభారత్ పనిష్మెంట్

**న్యూసెన్స్‌కు పాల్పడిన ముగ్గురికి స్వచ్ఛభారత్ పనిష్మెంట్**
**-కోర్టు ఆదేశాలతో గంటసేపు పారిశుధ్య పనులు**
**-మేడిపల్లి పోలీసుల చర్య**

**మేడిపల్లి వుదయం ప్రతినిధి అక్టోబర్ 28.**



పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్‌కు పాల్పడిన ముగ్గురు వ్యక్తులకు న్యాయస్థానం స్వచ్ఛభారత్ పనిష్మెంట్ విధించింది. న్యూసెన్స్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.
వివరాల్లోకి వెళితే.. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూసెన్స్‌కు పాల్పడిన బి. నరేష్ (27), జి. కరుణాకర్ (34), ఎం. శ్రీనివాస్ (36), ముగ్గురు పైన పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.
ఈ కేసులను విచారించిన న్యాయమూర్తి, సదరు వ్యక్తులు గంటసేపు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో న్యూసెన్స్‌కు పాల్పడిన వారికి స్వచ్ఛభారత్ పనిష్మెంట్ విధించినట్లయింది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా న్యూసెన్స్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మేడిపల్లి సి ఐ జలేందర్ రెడ్డి తెలిపారు.

## యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం



**జిన్నారం అక్టోబర్28(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మండల కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డా. కూన వేణుగోపాలకృష్ణను మండల యువజన సంఘాల సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జిన్నారం మండల తహసీల్దార్‌ను కూడా యువజన నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఆది రామకృష్ణ, యువజన నాయకుడు పుట్టి భాస్కర్‌లు మాట్లాడుతూ..... యువతను సామాజిక సేవా కార్యక్రమాల వైపు నడిపించడంలో రాష్ట్ర అధ్యక్షుడి కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో సమితిని బలోపేతం చేసి యువతకు తగిన బాధ్యతలు కల్పించాలని కోరారు. ఉమ్మడి మండలంలో యువజన సంఘాల తరపున చేపడుతున్న కార్యక్రమాలను రాష్ట్ర అధ్యక్షుడు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు పోచమ్మల స్వామి, సాయి రెడ్డి భూమయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలి



ఈటెల రాజేందర్ తో కలిసి పాదయాత్ర చేస్తున్న నమిలికొండ అనిల్ రెడ్డి

- ఈటల రాజేందర్ పాదయాత్రకు నమిలికొండ అనిల్ రెడ్డి మద్దతు

**మేడిపల్లి వుదయం ప్రతినిధి అక్టోబర్ 28**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించాలనే డిమాండ్‌తో బుధవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్రకు పిర్జాదిగూడ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షులు నమిలికొండ అనిల్ రెడ్డి మద్దతు తెలిపారు. ఎదులాబాద్ నుంచి జవహర్‌నగర్ వరకు నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు.
నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఈ పాదయాత్ర ఎదులాబాద్‌లో ప్రారంభమై ఘట్‌కేసర్, రాంపల్లి, కీసర, దమ్మాయిగూడ మీదుగా శుక్రవారం జవహర్‌నగర్‌కు చేరుకోనుంది.
ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ..... జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 10 నుంచి 15 కిలోమీటర్ల మేర దుర్వాసన వ్యాపిస్తోందని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, స్థానిక ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నట్లు తెలిపారు.ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఈ పాదయాత్ర ద్వారా డిమాండ్ చేస్తున్నారు. ఈ పాదయాత్రలో బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థలో బియ్యం సరఫరా, పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి

**-రంగారెడ్డి జిల్లా**

ప్రతిరోజూ బియ్యం నిల్వల వివరాలు తప్పనిసరిగా నవీకరించాలి ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి ఆదేశాలు

ఎల్‌నినో ప్రభావంతో బియ్యానికి పెరిగే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళిక

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు.. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం

రంగారెడ్డి జిల్లా ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) ద్వారా బియ్యం సరఫరా, పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తూ, ప్రజలకు సకాలంలో బియ్యం అందేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు.

బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, EOED ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ (MLS) పాయింట్ల ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యం తరలింపు, నిల్వలు, పంపిణీ, రోజువారీ స్టాక్ వివరాల నిర్వహణపై సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం తరలింపు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన సరఫరా, పంపిణీ కార్యక్రమాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియ్యం తరలింపును నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తూ, సంబంధిత రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం చేరేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన బియ్యం అందుబాటులో ఉండేలా సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌లో ప్రతిరోజూ బియ్యం నిల్వల వివరాలను తప్పనిసరిగా నవీకరించాలని, రోజువారీ స్టాక్ వివరాలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. గోదాముల్లో అందుబాటులో ఉన్న బియ్యం నిల్వలు, వచ్చిన సరుకు, తరలించిన సరుకు, మిగిలిన నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని తెలిపారు. స్టాక్ వివరాలు, రికార్డులు, వాస్తవ నిల్వల మధ్య ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని, ప్రతి రోజు నిల్వల వివరాలను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు.

## జిన్నారం సిఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**జిన్నారం అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని సీఐ కార్యాలయాన్ని కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణ నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన నాగార్జున గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మున్సిపాలిటీలో శాంతి భద్రతల స్థాపనకు



అన్ని విధాల సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28,(వుదయం ప్రతినిధి ),**

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ ) ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీల మైదానంలో భారీ ఎత్తున జరగబోయే ఓట్ బచావో - దేశ్ బచావో'ధర్నా కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి భారీగా క్యాడర్ తరలివెళ్తోంది. ఈ ధర్నాను విజయవంతం చేసేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్స భూపతి రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.
ఈ క్రమంలో నియోజకవర్గం నుండి ఢిల్లీ ధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్న 150 మంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తల అధికారిక పేర్ల జాబితాను సిద్ధం చేసి లిస్ట్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్స భూపతి రెడ్డి కలిసి టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగానియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ఢిల్లీ ధర్నాకు సంబంధించిన ఏర్పాట్లపై టీపీసీసీ అధ్యక్షులతో వారు చర్చించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఏఐసీసీ పిలుపునిచ్చిన ధర్నాను విజయవంతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**IN THE COURT OF HON'BLE XIth ADD. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: KUKATPALLY**
**O.S. NO. 443 OF 2026**

**Between :**
Smt. Prathapagiri Bhramaramba & others ..... Plaintiffs
**AND**
1. The Tahsildar, Kukatpally, Medchal Malkajgiri District, Telangana State.
2. To All Concerned .... Defendants

**PUBLIC NOTICE**
That the above named plaintiffs filed the above suit for declaration to declare them as legal heirs of deceased Late Mr. Prathapagiri Venkata Narasaiah who was died intestate on 03-08-2025, due to ill-health by leaving behind the petitioners as his legal heirs the above O.S. Is pending before the Hon'ble XIth ADD. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT KUKATPALLY, and the above suit is posted on 16.11.2026 for any objections. If any person's is are having any objections he/she may appear before the Hon'ble court on 16.11.2026 at 10:30 A.M. either in person or through an advocate failing which the matter will be decided as per law in your absence.
**//By the order of the Hon'ble court//**
**Sd/-**
**K.V. SRINIVASA RAO**
**V V LAW Associates Advocates & Associates 1stFloor, Scion Park View Apartment, Kukatpally, Telangana State. Ph: 8317598245.**




**IN THE COURT OF THE HON'BLE XIX ADDL JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**OS. No. 3312 of 2026**

**Between :**
1. Smt. V. Anitharani, W/o. Late Venu, Aged. 53 Years, Occ. House Wife, R/o. H.No 2-2-474/6/2, Buruju Gallay, Hyderabad District, T.S.500013. 2. Smt Vishwabrahmin Prathyusha D/o Late Venu, Aged. 34 Years, Occ. House Wife, R/o. H.No 2-2-474/6/2, Buruju Gallay, Hyderabad District, T.S.500013. 3. Smt Vishwabrahmin Maneesha D/o Late Venu, Aged. 33 Years, Occ.House Wife, R/o. H.No 2-2-474/6/2, Buruju Gallay, Hyderabad District, T.S.50 0013. ...Plaintiffs
**AND**
1. The Tahsildar, Amberpet Mandal, Hyderabad District.
2. All Concerned. ...Defendants
To, All Concerned ...(Defendant No. 2)
Whereas the Plaintiffs herein have instituted the above Suit OS No. 3312 of 2026 for declaration, to declare that the plaintiffs are the only legal heirs of the deceased SRI LATE VENU and the above suit is posted to 13.11.2026 for appearance of the Defendant No. 2. Take notice that, if anybody is/are having objections, they may appear before in the Court of the Hon'ble XIX Addl Junior Civil Judge, City civil court at Hyderabad on. 13.11.2026 at 10:30 a.m. either in person or through a counsel duly instructed, failing which the matter will be decided on merits.
**// BY ORDER OF THE COURT //**
**Sd/-**
**Kore Vishwanath**
**Advocate**
**Flat No. 508, KKR Golden Enclave Apts, Ambience Fort Road, Beside RS Brothers, Pillar No. 125, PVNR Express Way, Athapur, Hyderabad-500 048.**
**Ph: 9848027536**

**IN COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE CUM VI ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL MALKAJGIRI DISTRICT : AT : MEDIPALLY**
**O.S.NO. 404 OF 2026**

**Between :**
K. Shyam Kumar S/o. K. Satyam, Aged about 41 years, Occ: Pvt. Employee, R/o.H.No. 14-79, Swaroop Nagar Colony, Uppal, erstwhile R.R.District, M.M. District. ...Plaintiffs
AND
1. K. Praveen Kumar, S/o. Late K. Satyam, Aged about 37 years, Occ: Pvt. Employee, R/o.H.No.50/32, Raghavan Colony, Chennai, Presently residing at C/o. Kukkaduvvu Srinivasa Mudiraj, Vanniguda Village, Kesara Mandal, Ranga Reddy District, Telangana.
2. The Tahsildar, Medipally Mandal, M.M. District.
3. All Concerned ...Defendants
Whereas the plaintiffs have instituted the above suit to declare them as only surviving legal heirs of Late K. Satyam S/o. K. Mankaiah who died on 14-12-2015 and K. Shantha Bai W/o. K. Satyam who died on 12-08-2011. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to suit or who shall be accompanied by some person able to answer all such questions on the 30-10-2026, at 10.30 a.m. in the to answer claim and of your defense and to produce on said day all documents in your possession or power upon which you base your defence. Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence as exparte
**// BY ORDER OF THE COURT //**
**Sd/-**
**M/s. D.RAVALI**
**Advocates**
**#H.No. 13-117, Srisri Nagar Colony, Near Spark Concept School, Uppal, Hyderabad 39.**
**Mobile No.94920 51742**
**Counsel for the Petitioner/Plaintiff**

**IN THE COURT OF THE X JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.No. 3304 OF 2026**

**Between :**
1. Smt. Dandi Pavani, W/o late Dandi Suresh, Aged about 52 years, Occ: House Hold, 2. Ms. Dhandi Jyothsna, D/o late Dandi Suresh, Aged about 26 years, Occ: Student, 3. Ms. Dhandi Shalini, D/o late Dandi Suresh, Aged about 25 years, Occ: Student 4. Ms. Dhandi Sreemayee, D/o late Dandi Suresh, Aged about 20 years, Occ: Student, 5. Dhandi Rithvik Ram, D/o late Dandi Suresh, Aged about 17 years, Occ: Student, Minor, through her Natural Mother & Guardian, Smt. Dandi Pavani (Plaintiff No.1) All R/o H.No.3-6-72/16, Basheergabh, Himayatnagar, Hyderabad-29. ...PLAINTIFFS
**AND**
1. Tahsildar, Himayatnagar Mandal, Hyderabad District.
2. All Concerned ...DEFENDANTS

**NOTICE TO THE GENERAL PUBLIC**
It is hereby notified that the above-named plaintiffs have filed the above suit seeking a declaration of their status as the legal heirs of Late Dandi Suresh, limited to their legal status as such. The Hon'ble Court has permitted the plaintiffs to issue notice to the general public by way of publication. The matter is posted to 13-11-2026 for appearance of any person having objections to the declaration sought by the plaintiffs. Therefore, any person having any objection to the said declaration may appear before the Hon'ble X Junior Civil Judge, City Civil Court, Hyderabad, on 13-11-2026 at 10:30 A.M., and submit their objections. In default of appearance, the matter will be proceeded with in accordance with law.
**// BY ORDER OF THE COURT //**
**Sd/-**
**ALENOOR SRINIVAS ADVOCATE**
**H.No. 3-6-67 & 68, Ground Floor, BN Reddy Towers, Avanthi Nagar, Basheerbagh, Hyderabad- 500029.**
**Cell: 9440085308**

**IN THE COURT OF THE X JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.No. 3331 OF 2026**

**Between :**
1. Smt. D.R. Veena Ramesh, W/o late D.R. Ramesh, Aged about 53 years, Occ: House Hold, 2. Mr. Dhandi Ramaswamy Siddhanth, S/o late D.R. Ramesh, Aged about 26 years, Occ: Student, 3. Mr. Dhandi Ramaswamy Om Kirthi Kanth, S/o late D.R. Ramesh, Aged about 25 years, Occ: Student, 4. Ms. Dhandi Ramaswamy Pranavi, D/o late D.R. Ramesh, Aged about 17 years, Minor, Occ: Student, Represented by her natural guardian & mother Smt. D.R. Veena Ramesh (Plaintiff No.1). All are R/o H.No.3-6-72/16, Basheerbagh, Himayatnagar, Hyderabad-500 029 ....PLAINTIFFS
**AND**
1. Tahasildar, Himayatnagar Mandal, Hyderabad District.
2. All Concerned ...DEFENDANTS

**NOTICE TO THE GENERAL PUBLIC**
It is hereby notified that the above-named plaintiffs have filed the above suit seeking a declaration of their status as the legal heirs of Late D.R.Ramesh, limited to their legal status as such. The Hon'ble Court has permitted the plaintiffs to issue notice to the general public by way of publication. The matter is posted to 13-11-2026 for appearance of any person having objections to the declaration sought by the plaintiffs. Therefore, any person having any objection to the said declaration may appear before the Hon'ble X Junior Civil Judge, City Civil Court, Hyderabad, on 13-11-2026 at 10:30 A.M., and submit their objections. In default of appearance, the matter will be proceeded with in accordance with law.
**// BY ORDER OF THE COURT //**
**Sd/-**
**ALENOOR SRINIVAS, ADVOCATE**
**MURTHY, Advocates H.No. 3-6-67 & 68, Ground Floor, BN Reddy Towers, Avanthi Nagar, Basheerbagh, Hyderabad- 500029.**
**Cell: 9440085308**

**IN THE COURT OF THE HON'BLE VI TH ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM- VI ADDITIONAL J.M.F.C: RANGA REDDY DISTRICT: AT: L.B. NAGAR**
**O.S.NO. 764 OF 2026**

**Between :**
1). SMT. GUNDAWAR KRISHNA KUMARI, W/o Late Prakash Gundawar, Aged: 65 Years, Occ: House wife, R/o H-No 11-13-608/2, Haripuri Colony-2, R.K Puram, SaroorNagar, Ranga Reddy District-500035. 2). SMT. GUNDAWAR PRIYANKA, D/o Late Prakash Gundawar, W/o Aged: 38 Years, Occ: House wife, R/o H-NO 11-13-608/2, Haripuri Colony-2, R.K Puram, SaroorNagar, Ranga Reddy District-500035. 3). PRANAY GUNDAWAR, S/o Late Prakash Gundawar, Aged: 36 Years, Occ: Private Service, R/o H-No 11-13-608/2, Haripuri Colony-2, R.K Puram, SaroorNagar, Ranga Reddy District-500035. ...Plaintiffs
**AND**
1). THE MANDAL REVENUE OFFICER/ TAHSILDAR, Saroor Nagar Mandal, Saroor Nagar Road, Gayathri Nagar Kothapet, Ranga Reddy District-500035.
2) All Concerned ...Defendants
NOTICE
General public are hereby informed that the Plaintiffs have filed the above Suit for Declaration to declare that the plaintiffs as legal heirs of Late Sri. Gundawar Prakash, being the only legal heirs and successors, except them there is no other legal heirs. Any person having any objection to declaring them as being the only legal heirs and successors of Late Sri. Gundawar Prakash, may appear before the Hon'ble Court on 06-11-2026 at 10.30 A.M. either in person or through pleader Otherwise the matter will be decided according to law
**(By Order of the Court)**
**Sd/-**
**Mr. Sudhakar Rao Advocate Office at, Flat No 201, II Floor, "DMR GOVIND KUTI" H-No 3-4-179, Lingampally, Kachiguda, Hyderabad-500027**
**Sudhakarrao1473@gmail.com**
**Mobile No 9440317333**



"టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు. దీని గురించి ఏ వ్యాపారి మాట్లాడే ధైర్యం చేయలేకపోతున్నారు. టాటా గ్రూప్ సామాజిక నిబద్ధతను, యాజమాన్య విధానాలను పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ట్రస్ట్‌ను బలహీనపరిస్తే గ్రూప్ కంపెనీలు, వాటిపై ఆధారపడిన ఉద్యోగుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుంది. ఇంత జరుగుతున్నా.. ఏ వ్యాపారవేత్త కూడా ఒక్క మాట మాట్లాడటానికి సాహసించట్లేదు."

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

## వే'మన' పద్యం

కర్మమధికమయిన గడచిపోవగరాదు
ధర్మరాజు తెచ్చి తగని చోట
గంకుభట్టుచేసె గటగటా దైవంబు
విశ్వదాభిరామ వినురవేమ



# సంపాదకీయం

## ధరల మంటలో సామాన్యుడి విలవిల

గత ఏడాది కాలంలో పెట్రోల్, డీజిల్ ధరలు, వంట గ్యాస్ ధరలు, పాల ధరలు పెరగడం ప్రజలపై అదనపు భారాన్ని మోపింది. బియ్యం, పప్పులు, వంట నూనెలు, కూరగాయల ధరలు కూడా కుటుంబ బడ్జెట్లను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లిపాయలు వంటి నిత్యావసర కూరగాయల ధరల్లో స్వల్పకాలంలోనే భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులు సాధారణమైనవే అయినా, వాటి ప్రభావాన్ని భరించాల్సి వస్తున్నది మాత్రం పరిమిత ఆదాయంతో జీవించే కుటుంబాలే. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆదాయంలో అధిక భాగం ఆహారం, రవాణా, వైద్యం, విద్య, ఇంటి అద్దె వంటి కనీస అవసరాలకే ఖర్చవుతుంది. ఈ రంగాల్లో ధరలు పెరిగితే ఇతర అవసరాలకు ఖర్చు చేయడానికి అవకాశం తగ్గిపోతుంది. పిల్లల చదువు, కుటుంబ ఆరోగ్యం, భవిష్యత్తు కోసం పొదుపు చేయడం కష్టమవుతుంది. చివరకు అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రష్యా నుంచి రాయితీ ధరలకు ముడి చమురు దిగుమతి చేసుకున్నప్పటికీ ఆ ప్రయోజనం వినియోగదారులకు ఎంతవరకు చేరింది? అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పుడు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోవడానికి కారణాలేమిటి? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలి. చమురు ధరలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నుల భారం కూడా సమీక్షించాలి. ఎందుకంటే ఇంధన ధరలు రవాణా ఖర్చుల ద్వారా దాదాపు అన్ని వస్తువుల ధరలను ప్రభావితం చేస్తాయి ఈ మార్పులు కనిపించనప్పుడు వృద్ధి గణాంకాలు మాత్రమే ప్రజల కష్టాలను తీర్చలేవు. ఉపాధి రంగంలో నెలకొన్న పరిస్థితులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా యువత, మహిళలు ఉద్యోగాల కోసం తీవ్రంగా పోటీపడుతున్నప్పటికీ తగిన అవకాశాలు లభించడం లేదు. అసంఘటిత రంగం, కాంట్రాక్టు ఉద్యోగాలు, చిన్న ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారికి వేతనాల పెంపు అంతంతమాత్రంగానే ఉంది. కాబట్టి ఆర్థిక విధానాల లక్ష్యం కేవలం వృద్ధి రేటును పెంచడమే కాకుండా, విస్తృత స్థాయిలో ఉపాధిని కల్పించడం, ప్రజల ఆదాయాలను మెరుగుపరచడం కావాలి. ధరల పెరుగుదలను నియంత్రించేందుకు రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచే విధానం అనుసరిస్తుంది . ఆహార ధాన్యాలు, పప్పులు, వంట నూనెలు, కూరగాయల సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైన వస్తువుల బఫర్ నిల్వలను సమర్థంగా వినియోగించి, కొరత ఏర్పడినప్పుడు తగిన చర్యలు చేపట్టాలి. అధిక నిల్వలు పెట్టి కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్‌లో పోటీని దెబ్బతీసే గుత్తాధిపత్యాలు, కార్టెల్ కార్యకలాపాలను అరికట్టాలి.ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అర్హులైన కుటుంబాలకు బియ్యం, గోధుమలు, పప్పులు వంటి అవసరమైన ఆహార పదార్థాలను అందుబాటు ధరలకు సరఫరా చేయాలి. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూనే వినియోగదారులకు సరసమైన ధరలకు సరుకులు అందేలా ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలి. ఎల్‌నినో వంటి వాతావరణ ముప్పులు ఎదురయ్యే పరిస్థితుల్లో పంటల బీమా, సాగునీరు, వ్యవసాయ మద్దతు చర్యలను విస్తరించాలి.అదే సమయంలో కనీస వేతనాలను ధరల సూచీకి అనుసంధానించడం అవసరం. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగినన్ని నిధులు కేటాయించి, పని దినాలను పెంచాలి. పట్టణ పేదలకు కూడా ఉపాధి భద్రత కల్పించే విధానాలను పరిశీలించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు తక్కువ వ్యయంతో రుణాలు అందించి, వస్త్రాలు, ఆహార శుద్ధి, నిర్మాణం, ఆరోగ్యం, విద్య వంటి అధిక ఉపాధి కల్పించే రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత వేగంగా పరుగెడుతోందన్నదానికంటే, ఆ పరుగులో సామాన్యుడు ఎంతవరకు ముందుకు సాగుతున్నాడన్నదే ముఖ్యమైనది. జీడీపీ పెరిగినా కుటుంబాల ఆదాయాలు పెరగకపోతే, పరిశ్రమలు విస్తరించినా తగిన ఉపాధి లభించకపోతే, మార్కెట్లలో సరుకులు ఉన్నా వాటిని కొనుగోలు చేసే శక్తి ప్రజలకు లేకపోతే ఆ వృద్ధి పరిపూర్ణమైన ప్రగతి కాజాలదు. ప్రభుత్వం నివేదికల్లో హెచ్చరికలు చేయడానికే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్ష ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలి. ధరలను అదుపు చేయాలి. ఉపాధిని పెంచాలి. వేతనాలను మెరుగుపరచాలి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలి.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# పొదుపే రక్షణ.. నేటి భద్రత.. రేపటి భవిష్యత్తు!

### ఆర్థిక క్రమశిక్షణే సుఖమయ జీవితానికి మార్గం

పొదుపు అనే పదం మనం తరచుగా వింటూ ఉంటాం..వాడుతూ ఉంటాం..కానీ దాని గూర్చి అంతగా ఆలోచించం. ఆదాయం తగ్గిపోయి జేబులో డబ్బులు నిండుకున్నప్పుడు మాత్రమే పొదుపు, దుబారా లాంటి మాటలు గుర్తుకొస్తాయి. ఆ తర్వాత షరా మామూలే. నిజానికి డబ్బు అవసరం లేనివారు ఈ భూప్రపంచంలో బహుశా ఎవరూ ఉండరు. ప్రతి ఒక్కరికీ ధనం అవసరమే. దానికోసం రకరకాల మార్గాలు అన్వేషిస్తారు. ఏదో ఒక విధంగా సంపాదించాలి.. నాలుగు రాళ్ళు వెనకేసుకోవాలి.. రేపటి అవసరాల కోసం దాచుకోవాలి. ఇది అందరిలో ఉండే ఆరాటమే. దీన్నే ముందుచూపు అంటారు. భవిష్యత్తు అవసరాల కోసం ప్రస్తుత ఆదాయం నుంచి కొంత భాగం ఖర్చు పెట్టకుండా దాచుకోవడాన్ని పొదుపు అంటారు. పొదుపును నిర్ణయించే ప్రధాన కారకం ఆదాయం. ఆదాయం అధికంగా ఉంటే సాధారణంగా పొదుపు కూడా ఎక్కువగానే ఉంటుంది. అందుకే ఆదాయానికి, పొదుపుకు అవినాభావ సంబంధం ఉందంటారు. తక్కువ ఆదాయం ఉన్నవారికి, వారికి లభించే కొద్దిపాటి సొమ్ము వారి అవసరాలు తీర్చుకోవడానికే సరిపోతుంది. దాంతో అవసరాలు తీరిన తర్వాత మిగిలే పొదుపు చాలా స్వల్పంగానే ఉంటుంది.

సాధారణ వాడుకలో పొదుపు అంటే తమ సంపాదనలో డబ్బును ఖర్చు పెట్టకుండా అట్టిపెట్టుకోవడం. ఆర్థిక శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే ఆదాయంలో వినియోగం పోగా మిగిలింది పొదుపు. ఇంకా సులువుగా చెప్పుకోవాలంటే ఖర్చును తగ్గించుకోవడం.. మరీ ముఖ్యంగా దుబారా ఖర్చులను అదుపు చేయడం. పెట్టుబడులలో నష్టాల భయం ఉంటుంది కనుక ధనాన్ని ఖర్చు చేయకుండా ఉంచుకోవడమే పొదుపునకు సరైన అర్థం. వ్యావహారికంగా పొదుపు ఒక విధమైన ఆలోచనా విధానం, జీవన విధానం కూడా! అయితే, పిల్లికి బిచ్చం వేయనంత పిసినారిగా మారకూడదు. అసలు డబ్బు ఎందుకు అనే విషయంలో ఒక స్పష్టత ఉండాలి. జీవిత అవసరాలకా.. దుబారాలకా.. విలాసాలకా.. తరువాతి తరాలకా.. ఇలా రకరకాల కారణాలతో సంపాదన వైపు దృష్టిసారిస్తారు. చాలామంది సంపాదించినా నిలబెట్టుకోలేరు. ఎక్కువ సంపాదించేవారైనా, తక్కువ సంపాదనపరులైనా, కొంతమందే ఆస్తులు కూడబెట్టుకోగలుగుతారు.

దీనికి కారణం, సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోవడమే.

ఇల్లు గెలవాలి.. ఆర్థిక బాధ్యత పంచాలి

కుటుంబంలో సంపాదించేవారు ఒక్కరైనా, అందరైనా.. ఆర్థిక ప్రణాళికలో అందరి భాగస్వామ్యం ఉంటే మంచిది. కుటుంబ సభ్యులందరిలోనూ, అనవసర వ్యయాలు తగ్గించుకొని పొదుపు చేయాలన్న కోరిక ఉండాలి. దీనికోసం ఆర్థిక ప్రణాళిక ఎలా ఉండాలో తెలిసి ఉండాలి. ప్రతి ఇంట్లో బడ్జెట్ అనేది ఉంటుంది. ఆ మాటకొస్తే ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా జమా ఖర్చుల లెక్క ఉండాలి. వ్యక్తిగత ఖర్చులు, ఇంటి ఖర్చులు, పిల్లల పాకెట్ మనీ ఇలా రకరకాల వ్యయాలుంటాయి. అయితే కుటుంబ సభ్యులందరూ ఎవరికి కేటాయించిన బడ్జెట్‌లో వాళ్ళు ఖర్చులు పెట్టుకొని, ప్రతి ఒక్కరూ అందులోంచే పొదుపు చేయాలి. చాలామంది పిల్లలకు పాకెట్ మనీ ఇస్తారు. కానీ ఎలా ఖర్చుపెట్టాలో..దేనికోసం ఖర్చుపెట్టాలో వారికి తెలియదు. అందుకని వారికి పొదుపు పాఠాలు నేర్పాలి. పాకెట్ మనీ మొత్తం ఖర్చు చేయకుండా ఎలా ఆదా చేయాలో వారికి అవగాహన కల్పించాలి. తద్వారా కొంత దాచుకోవడం అలవాటు అవుతుంది. అలాఅని వారిని పిసినారులుగా తయారు చేయకూడదు. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇలా చిన్నప్పుడే నేర్పిన పొదుపు పాఠాలు.. వారికి భావి జీవితంలో ఎంతగానో ఉపయోగపడతాయి.చాలామంది తల్లిదండ్రులు తమ ఆర్థిక లావాదేవీల గురించి పిల్లలకు చెప్పరు. ఇంటి ఆదాయం, ఖర్చులు, అప్పులు, పొదుపు, బరువు బాధ్యతలు పిల్లలకు తెలియాలి. ప్రతీ నెల కుటుంబానికి అయ్యే ఖర్చుల గురించి, అంటే నెలవారీ ఇంటి బడ్జెట్ గురించి వారితో చర్చిస్తే మంచిది. ఇంటి జమా ఖర్చుల విషయంలో వారి సలహాలు తీసుకుంటే ఇంకా మంచిది. దీనివల్ల వారికీ బాధ్యతలు తెలుస్తాయి. బడ్జెట్ రూపకల్పనలో వారి సలహాలు ఉపయుక్తంగా ఉండే అవకాశమూ ఉంది.



డిజిటల్ యుగంలో తెలివైన కొనుగోళ్లు

నేటి ఆధునిక కాలంలో డిజిటల్ విప్లవం పెరిగిన తర్వాత నిత్యావసర వస్తువుల నుంచి సకల సమస్తమూ వేలిముద్రల తోటే ఇంటిముందుకే వచ్చేస్తున్నాయి. అలా అని అవసరమైనవీ, అవసరం లేనివీ పది రకాల వస్తువులు కొనేయకూడదు. అవసరమైనవి మాత్రమే, అవికూడా ఎక్కువ తక్కువ కాకుండా సరిపడినంత వరకు మాత్రమే ఖరీదు చేయాలి. ఏరోజుకారోజు మారుతున్న ధరలు, నాణ్యత విషయంలో అవగాహన ఉండాలి. కొన్ని రకాల వస్తువులు ఆన్‌లైన్‌లో దొరుకుతాయి. కొన్ని వస్తువులు బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకు లభిస్తాయి. మరి కొన్ని మార్కెట్ ధరతో బేరీజు వేసుకొని, నాణ్యత పరిశీలించుకొని కొనుగోలు చేయవచ్చు. దీనివల్ల ఎంతోకొంత పెట్రోలు, వాహనాల చార్జీలకయ్యే ఖర్చు పొదుపవుతుంది. సమయమూ వృథా కాకుండా ఆదా అవుతుంది. కూర్చున్న చోటుకే మనకు కావలసిన వస్తువులు వచ్చేస్తాయి. ఆన్‌లైన్‌లో లభించే ప్రత్యేక ఆఫర్లు, పండుగ రాయితీలు వినియోగించుకుంటే ఎంతోకొంత డబ్బు ఆదా చేయవచ్చు. అలాఅని కేవలం ఆన్‌లైన్ మోజులోనే పడిపోతే బ్యాంకు ఖాతాలో డబ్బులన్నీ క్షణాల్లో ఖాళీ అయిపోతాయి. ఏ విషయంలో అయినా అతి పనికిరాదు. ఇక్కడ కూడా అదే సూత్రం వర్తిస్తుంది.కొంతమంది ఆదివారాలు వచ్చాయంటే చాలా డబ్బులు దుబారా చేస్తుంటారు. కుటుంబమంతా కలిసి బయటికెళితే చాలా ఖర్చవుతుంది. సినిమాలు, షికార్లు, హోటల్ భోజనం తడిసి మోపెడవుతుంది. వినోదం మిస్ కాకుండానే, ఈ అనవసరపు ఖర్చును పొదుపు చేయాలంటే దానికోసం ఇంటినే ఒక వేదికగా మలచుకొనే ఉపాయం ఆలోచించాలి. కుటుంబ సభ్యులందరూ కలసి చూడగలిగే మంచి సినిమాలు ఏమైనా ఉంటే ఇంట్లోనే ఓటీటీలు లేదా టీవీల ద్వారా చూసే ప్రయత్నం చేయాలి. ఏవిధంగానూ సభ్యతకు, విలువలకు భంగం కలిగించని షార్ట్ ఫిల్ములు, డిజిటల్ గేమ్స్ ప్లాన్ చేసుకోవాలి. వ్యక్తిత్వ వికాసానికీ, నైతిక విలువలకు సంబంధించిన, విజ్ఞానం, వినోదం కలగలిసిన కార్యక్రమాలు రూపొందించుకోవాలి. అందరూ కలిసి దగ్గరలోని పార్కుకో, పచ్చిక బయలు వైపో ప్రశాంతంగా నడుచుకుంటూ వెళ్ళి చల్లని సాయంత్రాన్ని ఆస్వాదించవచ్చు. ఒకవేళ ఆ పూటకు ఇంట్లో వంట చేయకపోయినా, నచ్చిన ఆహారాన్ని పార్సెల్ లేదా ఫుడ్ యాప్‌ల ద్వారా ఇంటికే తెప్పించుకోవచ్చు. ఇలా చేయడం వల్ల ఖర్చు సగానికి సగం ఖచ్చితంగా తగ్గిపోతుంది. ఆరోగ్యానికీ మంచిది. ఇంట్లో అందరూ కలిసిమెలిసి ఆనందంగా సమయం గడిపినట్టూ ఉంటుంది.

జీవితంలో పొదుపు.. ఒక నిరంతర సాధనఅలాగే పొదుపునకు సంబంధించి పాటించవలసిన అంశాలు ఇంకా అనేకం ఉన్నాయి. ఉదాహరణకు, దుస్తుల విషయంలో.. అవసరమున్నా, లేకపోయినా చాలామంది ఏదో ఒక సందర్భం సాకుతో కొత్త బట్టలు కొంటూ ఉంటారు. విద్యుత్తు విషయంలో కూడా జాగ్రత్తలు పాటించరు. గదుల్లో ఎవరూ లేకపోయినా ఫ్యాన్లు తిరుగుతూనే ఉంటాయి.. లైట్లు వెలుగుతూనే ఉంటాయి.. నీటినీ వృథా చేస్తారు.. మొబైల్ రీచార్జీలు, డేటా వాడకం కూడా అంతే. అలాగే, ప్రతి చిన్న పనికీ వాహనాలు వినియోగిస్తుంటారు. నాలుగడుగులు వెళ్ళాలంటే బైక్ తీయాల్సిందే. సైకిలు ఎప్పుడో మూలన పడింది. నిజానికి స్థానిక అవసరాలకు, చిన్న చిన్న పనులకు సైకిల్ వినియోగించవచ్చు లేదా నడిచి వెళ్లవచ్చు. దీనివల్ల ఇంధనం ఆదా అవుతుంది, ఆరోగ్యానికీ ఎంతో మంచిది.

అసలు అదీ ఇదీ అని కాకుండా జీవనరంగంలోని అన్ని విషయాల్లోనూ పొదుపు పాటించడం అత్యంత అవసరం. డబ్బు ఖర్చు లేదు కదా అని నోటిని కూడా గాలికి వదలకూడదు. ఆచితూచి పొదుపుగా మాట్లాడాలి. నోటి దుబారా అనేక అనర్థాలకు దారితీస్తుంది.

అయితే ఈ పొదుపు సూత్రాలు పాటించడం మాటలు చెప్పుకున్నంత సులువేమీ కాదు. కానీ నిశ్చయంతో ప్రయత్నిస్తే కష్టసాధ్యమూ కాదు. మొదలుపెట్టిన కొద్ది రోజుల్లోనే అద్భుత ఫలితాలు రావాలని ఆశించడం కూడా సరికాదు. ఒక పద్ధతి ప్రకారం ఆర్థిక ప్రణాళిక అమలు చేసుకుంటూ పోతే, కొన్ని నెలల తర్వాత కుటుంబ నిర్వహణకు సంబంధించిన జమా ఖర్చుల లెక్కలను చక్కగా ప్లాన్ చేసుకునే నైపుణ్యం అలవడుతుంది. తద్వారా మనకు తెలియకుండానే పొదుపు పెరుగుతుంది. అలా పొదుపయిన ప్రతీ రూపాయి అదనపు ఆదాయం కిందే లెక్క. అయితే పొదుపు వ్యామోహంలో పడి మరీ పిసినారులుగా మారిపోకూడదు. కుటుంబానికీ, బంధువులకూ, పేదసాదలకూ తమ సంపాదనలో ఎంతోకొంత వాటా కల్పించాలి. సత్కార్యాలకూ సంపాదన వెచ్చించాలి. పొదుపు అంటే, నోరూ చేతులు కట్టేసుకోవడం కాదు. ఆదాయ వ్యయాలను బేరీజు వేసుకొని ఉన్నంతలో సంతృప్తిగా జీవించడం. మధ్యేమార్గాన్ని అవలంబిస్తూ, దైవం ప్రసాదించిన సంపదను సరైన విధంగా సద్వినియోగం చేసుకుంటే ఆత్మసంతృప్తి లభిస్తుంది. సమాజమూ హర్షిస్తుంది. దేవుడూ మెచ్చుకుంటాడు.



యం డి. ఉస్మాన్ ఖాన్

# రాజకీయ రంగస్థలంపై నాయకుల విన్యాసాలు"

"చదువులందు రాజపదవులందును పాడి
మొదవులందు స్త్రీల పెదవులందు
ఆశలుడుగునట్టి యయ్యలు ముక్తులు
విశ్వదాభిరామ వినుర వేమ!"

వేమన పద్యంలోని భావం మనిషి ఆశలకు హద్దులు ఉండాలని, పదవులు, ఆస్తులు, భోగాలపై మితిమీరిన మోహం మనిషిని బంధిస్తుందని గుర్తుచేస్తుంది. ఆశ ఉండటం తప్పు కాదు. కానీ ఆ ఆశ అత్యాశగా మారి, మనిషిలోని విచక్షణను, మానవత్వాన్ని, కుటుంబ అనుబంధాలను మింగేస్తే మాత్రం అది అభివృద్ధి కాదు.. పతనం!

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు వంటి స్థానిక రాజకీయాల నేపథ్యంలో కనిపించే కొన్ని పోటీ ధోరణులను చూస్తే వేమన పద్యంలోని అంతరార్థం గుర్తుకు రాకమానదు. ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి రావాల్సినవారు, పదవుల కోసం ప్రాణాలు పెట్టే పరిస్థితి ఎందుకు వస్తోందో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఒకప్పుడు కుటుంబంలో అన్నదమ్ములు ఆస్తి పంపకాల విషయంలో గొడవపడేవారని విన్నాం. ఇప్పుడు కొన్నిచోట్ల ఆస్తులకన్నా పదవులే పెద్ద ఆస్తులయ్యాయి. అన్న ఒక పార్టీ నుంచి పోటీ చేస్తే తమ్ముడు మరో పార్టీ జెండా పట్టుకుంటాడు. అక్క ఒక అభ్యర్థికి మద్దతిస్తే చెల్లెలు మరో అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తుంది. భార్యాభర్తలే వేర్వేరు రాజకీయ శిబిరాల్లో చేరి, ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పక్కన రెండు పార్టీల జెండాలు పెట్టుకునే పరిస్థితి వస్తే ఆశ్చర్యపోవాలా, నవ్వుకోవాలా?ఉదయం భార్య భర్తకు కాఫీ ఇస్తూ, "ఈరోజు ప్రచారానికి ఎంతమంది వస్తున్నారు?" అని అడుగుతుంది.భర్త గర్వంగా, "మన వెనుక ఊరంతా ఉంది!" అంటాడు.భార్య వెంటనే, "అయితే నేను పోటీ చేస్తున్నప్పుడు నువ్వెందుకు నా వెనుక లేవు?" అని ప్రశ్నిస్తుంది.

భర్త సమాధానం చెప్పలేక కప్పులోని కాఫీని చూస్తాడు. అందులో చక్కెర తక్కువగా ఉందో, రాజకీయాల్లో తనకు మద్దతు తక్కువగా ఉందో అర్థం కాక తల పట్టుకుంటాడు!ఇలా పదవుల పోటీ కుటుంబ బంధాలను కూడా ఎన్నికల గుర్తులుగా మార్చేస్తే, గెలిచేది ఎవరు? ఓడిపోయేది మాత్రం కుటుంబ ప్రశాంతతే

విచిత్రమేమిటంటే, ఈ రాజకీయ పోటీల్లో కొన్నిసార్లు విద్యావంతులు, వ్యాపారవేత్తలు, న్యాయవాదులు, వైద్యులు, ఉన్నతాధికారులుగా పనిచేసి పదవీ విరమణ చేసినవారు కూడా కనిపిస్తారు. చదువులో పతకాలు సాధించినవారు, చట్టాలపై అవగాహన ఉన్నవారు, సమాజానికి మార్గదర్శకులుగా నిలవాల్సినవారు సైతం పదవుల కోసం పరస్పరందూషించుకోవడం, ఘర్షణలకు దిగడం చూస్తే ఒక ప్రశ్నతలెత్తుతుంది.ఒక డాక్టర్ రోగికి కోపాన్ని తగ్గించుకోవాలని సలహా ఇస్తాడు. కానీ తన రాజకీయ అభ్యర్థి ఓడిపోతాడని తెలిసినప్పుడు ఆయనే ఆగ్రహంతో ఊగిపోతే, ఆ సలహా ముందుగా ఆయనకే అవసరమేమో!ఒక న్యాయవాది చట్టం ముందు అందరూ సమానమని వాదిస్తాడు. కానీ తన పార్టీ అభ్యర్థి తప్పు చేసినప్పుడు మాత్రం, "మనవాళ్లకు ప్రత్యేక మినహాయింపు ఉండాలి!" అని అనుకుంటే న్యాయం ఎక్కడుంది?ఒక రిటైర్డ్ అధికారి జీవితాంతం పరిపాలనా నియమాలు పాటించి, క్రమశిక్షణ గురించి ఉపన్యాసాలు ఇచ్చి ఉంటాడు. కానీ ఎన్నికల సమయంలో ప్రత్యర్థి ఇంటి ముందు మైకులు పెట్టి రాత్రంతా నినాదాలు చేయిస్తే, ఆయన సాధించిన అనుభవం ప్రజలకు ఉపయోగపడినట్టా?విద్య మనిషికి విజ్ఞానాన్ని ఇవ్వాలి. విజ్ఞానం వివేకాన్ని పెంచాలి. వివేకం ప్రవర్తనలో కనిపించాలి. ఇవేవీ లేకుండా కేవలం అక్షరాలు నేర్చుకుంటే, అది విద్యావంతుడిని చేయవచ్చేమో కానీ సంస్కారవంతుడిని చేయదు.ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగలు కావాలి. కానీ కొన్ని సందర్భాల్లో అవి కక్షలు, ప్రతీకారాలు, వ్యక్తిగత దూషణలకు వేదికలవుతున్నాయి. ఓటు అడగడానికి వెళ్లిన అభ్యర్థి అభివృద్ధి గురించి మాట్లాడాలి. తన ప్రణాళికలు వివరించాలి. గ్రామానికి ఏం చేస్తాడో చెప్పాలి.

కానీ కొన్నిచోట్ల ప్రచారం మొదలవగానే అభివృద్ధి పక్కకు వెళ్లిపోతుంది. ప్రత్యర్థి వ్యక్తిగత జీవితం ముందుకొస్తుంది. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రజా సమస్యలు వెనుకబడిపోతాయి. ఎవరు ఎవరిని తిట్టారు? ఎవరు ఎవరిని కొట్టారు? ఎవరి తల పగిలింది? ఎవరి జెండా చినిగింది? అనే వార్తలే ముందుకొస్తాయి.ప్రజలు తమ సమస్యలతో అభ్యర్థి దగ్గరకు వెళ్తే, అభ్యర్థి మాత్రం తన సమస్యతో ప్రజల దగ్గరకు వస్తాడు!"అన్నా, మా వీధిలో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. పరిష్కరించండి" అని ఓటరు అడిగితే, "ముందు మా పార్టీకి ఓటేయండి. గెలిచాక చూస్తాం" అంటాడు."మా ఊరికి రోడ్డు వేయించండి" అంటే, "మా ప్రత్యర్థి పార్టీ వాళ్లు రోడ్డు వేయనివ్వడం లేదు" అని సమాధానం చెబుతాడు.ఐదేళ్లుగా రోడ్డు వేయించలేని నాయకుడు, ఎన్నికల ప్రచారంలో మాత్రం ఊరంతా తిరుగుతూ ఎన్నో కిలోమీటర్లు నడుస్తాడు. ప్రజలకు రోడ్లు వేయించకపోయినా, ప్రచారం కోసం నడిచే శక్తి మాత్రం ఆయనకు పుష్కలంగా ఉంటుంది!ఇలాంటి వ్యంగ్య పరిస్థితుల్లో ఓటరు ఒక్కసారి ఆలోచించాలి: తనకు నాయకుడు కావాలా? లేక ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నటుడు కావాలా?స్థానిక సంస్థల పదవులు చిన్నవిగా కనిపించినా ప్రజల దైనందిన జీవితంపై వాటి ప్రభావం చాలా పెద్దది. మున్సిపల్ పాలనలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, స్థానిక అభివృద్ధి కీలకం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ప్రతినిధులు కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి.అయితే ఆ పదవులను ప్రజాసేవకు లభించిన అవకాశాలుగా చూడాలా? లేక తమ పలుకుబడిని పెంచుకునే మెట్లుగా చూడాలా?ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేయడం హక్కు. గెలవాలని కోరుకోవడం సహజం. కానీ గెలుపు కోసం ప్రత్యర్థిని శత్రువుగా చూడటం, కుటుంబ సభ్యులతో సంబంధాలు తెంచుకోవడం, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం మాత్రం సమర్థనీయం కాదు.ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తి ప్రజాసేవ చేయలేడా? పదవి రానివాడు సమాజానికి ఉపయోగపడలేడా? పదవి లేనప్పుడే నిజమైన సేవకు ఎక్కువ స్వేచ్ఛ ఉంటుందేమో!ఒక వ్యక్తి పదవి పొందకముందు ప్రజలందరూ తనవాళ్లేనని చెబుతాడు. పదవి పొందిన తర్వాత తనకు ఓటు వేయనివారు కూడా తన ప్రజలేనని గుర్తుంచుకుంటేనే అతను నిజమైన నాయకుడు అవుతాడు.వేమన చెప్పిన ఆశల నియంత్రణ భావాన్ని నేటి రాజకీయ జీవితానికి అన్వయించుకుంటే ఒక గొప్ప సందేశం కనిపిస్తుంది. పదవులను కోరుకోవద్దని కాదు; పదవుల కోసం మన విలువలను తాకట్టు పెట్టవద్దని ఆ సందేశం చెబుతుంది.ఎన్నికల్లో గెలిచినవాడు ప్రజల మనసులను గెలిచాడా లేదా అనేది ముఖ్యం. ఓడిపోయినవాడు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాడా లేదా అనేది కూడా ముఖ్యం. కుర్చీలో కూర్చున్నంత మాత్రాన నాయకుడు కాలేడు. ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచినప్పుడే నాయకుడవుతాడు.రాజకీయాల్లోకి వచ్చే విద్యావంతులు తమ విద్యను, అనుభవాన్ని, సామాజిక బాధ్యతను ప్రజల సంక్షేమానికి వినియోగించాలి. వైద్యులు ఆరోగ్య సమస్యలపై, న్యాయవాదులు న్యాయ సమస్యలపై, వ్యాపారవేత్తలు ఉపాధి అవకాశాలపై, పదవీ విరమణ చేసిన అధికారులు పరిపాలనా అనుభవంపై దృష్టి పెట్టాలి. ప్రజాసేవలో పోటీ ఉండాలి కానీ వ్యక్తిగత విద్వేషం ఉండకూడదు.ప్రజలు కూడా కులం, మతం, డబ్బు, బంధుత్వం, పార్టీ అభిమానం వంటి అంశాలకే పరిమితం కాకుండా అభ్యర్థి నిజాయితీ, పనితీరు, ప్రజల పట్ల బాధ్యతను పరిశీలించాలి.ఎన్నికల సమయంలో ఎగిరే జెండాలు కొంతకాలానికి మడతపడి మూలన పడిపోతాయి. ప్రచార వాహనాలు ఆగిపోతాయి. మైకులు మూగబోతాయి. నినాదాలు నిశ్శబ్దమవుతాయి. కానీ ఆ సమయంలో మనుషుల మధ్య ఏర్పడిన గాయాలు మాత్రం కొన్నిసార్లు సంవత్సరాలపాటు మిగిలిపోతాయి.అన్నదమ్ములు మళ్లీ కలవాలంటే పదవులు అడ్డంకి కాకూడదు. భార్యాభర్తల మధ్య రాజకీయ భేదాలు ప్రేమను మింగకూడదు. ప్రత్యర్థి పార్టీ నాయకుడిని చూసినప్పుడు శత్రువును చూసినట్లు కాకుండా భిన్నమైన అభిప్రాయం కలిగిన పౌరుడిగా చూడాలి. ఎందుకంటే రాజకీయ పార్టీలు వేరు కావచ్చు.. జెండాలు వేరు కావచ్చు..

అభిప్రాయాలు వేరు కావచ్చు.. కానీ మనుషులుగా మనందరికీ కావాల్సింది ప్రశాంతమైన జీవితం, అభివృద్ధి చెందిన సమాజం, గౌరవప్రదమైన భవిష్యత్తు.వేమన పద్యం మనకు గుర్తుచేసే ప్రధాన సత్యం ఇదే: ఆశకు హద్దు ఉండాలి. పదవికి మించిన విలువ వ్యక్తిత్వం. అధికారానికి మించిన సంపద మానవత్వం.పదవి కోసం పదిమందిని శత్రువులుగా చేసుకున్నవాడు, గెలిచాక కుర్చీలో ఒంటరిగా కూర్చోవాల్సి వస్తుంది. ప్రజల మనసుల్లో చోటు సంపాదించినవాడు మాత్రం పదవి లేకపోయినా నాయకుడిగానే నిలుస్తాడు!విశ్వదాభిరామ వినుర వేమ.. పదవుల కోసం పోరాడే ముందు, మనిషిగా మనల్ని మనం ఒకసారి ప్రశ్నించుకుందాం!

జడ్పీటీసీ ఎన్నికలు వంటి స్థానిక రాజకీయాల నేపథ్యంలో కనిపించే కొన్ని పోటీ ధోరణులను చూస్తే వేమన పద్యంలోని అంతరార్థం గుర్తుకు రాకమానదు. ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి రావాల్సినవారు, పదవుల కోసం ప్రాణాలు పెట్టే పరిస్థితి ఎందుకు వస్తోందో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఒకప్పుడు కుటుంబంలో అన్నదమ్ములు ఆస్తి పంపకాల విషయంలో గొడవపడేవారని విన్నాం. ఇప్పుడు కొన్నిచోట్ల ఆస్తులకన్నా పదవులే పెద్ద ఆస్తులయ్యాయి. అన్న ఒక పార్టీ నుంచి పోటీ చేస్తే తమ్ముడు మరో పార్టీ జెండా పట్టుకుంటాడు. అక్క ఒక అభ్యర్థికి మద్దతిస్తే చెల్లెలు మరో అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తుంది. భార్యాభర్తలే వేర్వేరు రాజకీయ శిబిరాల్లో చేరి, ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పక్కన రెండు పార్టీల జెండాలు పెట్టుకునే పరిస్థితి వస్తే ఆశ్చర్యపోవాలా, నవ్వుకోవాలా?ఉదయం భార్య భర్తకు కాఫీ ఇస్తూ, "ఈరోజు ప్రచారానికి ఎంతమంది వస్తున్నారు?" అని అడుగుతుంది.



డా. పూసపాటి వేదాద్రి
9912197694



# జాతీయం-అంతర్జాతీయం





## 'పరిశ్రమ' పిటిషన్‌పై విచారణకు సుప్రీం అంగీకారం

**న్యూఢిల్లీ :**
పారిశ్రామిక సంబంధాల కోడ్-2020లో 'పరిశ్రమ' నిర్వచనం అస్పష్టంగా ఉందంటూ తమిళనాడు ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. ఈ చట్టం పరిధి నుంచి ధార్మిక, సామాజిక, పరోపకార సంస్థలతోపాటు ప్రభుత్వ సార్వభౌమ విధులకు సంబంధించిన కార్యకలాపాలకు మినహాయింపులు ఇవ్వడాన్ని కార్మిక సంఘం సవాలు చేసింది. ఐఆర్‌సీలోని సెక్షన్ 2(పి) ప్రకారం, మానవ అవసరాలను తీర్చేందుకు వస్తువులు లేదా సేవలను ఉత్పత్తి చేయడం, సరఫరా చేయడం, పంపిణీ చేయడం వంటి క్రమబద్ధమైన కార్యకలాపాలను 'పరిశ్రమ'గా పరిగణిస్తారు. ఈ నిర్వచనం గతంలో సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని ఎఐటియుసి తరఫు న్యాయవాదులు వాదించారు. 1978లో బెంగళూరు వాటర్ సప్లై కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పురపాలక సంస్థలు వంటి వాటిని కూడా పరిశ్రమలుగా పరిగణించవచ్చు. అయితే, కొత్త చట్టంలోని నిర్వచనానికి పాత తీర్పు నేరుగా వర్తించదని 2026 ఆగస్టులో తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం అభిప్రాయపడింది. కార్మికుల హక్కులను కాపాడేందుకు పరిశ్రమకు విస్తృత నిర్వచనం అవసరమని జస్టిస్ బి.వి. నాగరత్న అభిప్రాయపడ్డారు. ఎఐటియుసి పిటిషన్‌ను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, కేసును త్వరగా విచారణకు షెడ్యూల్ చేస్తామని తెలిపారు. ఈ కేసులో సుప్రీంకోర్టు నిర్ణయం కార్మికులకు లభించే చట్టపరమైన రక్షణలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## పశ్చిమబెంగాల్‌లో బిజెపి ప్రభుత్వంలో వరుస ఎన్‌కౌంటర్లు..

**కోల్‌కతా :**
పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుస ఎన్‌కౌంటర్లు కలకలం సృష్టిస్తున్నాయి. గత 24 గంటల్లో రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఉత్తర 24 పరగణాల జిల్లాలో అత్యాచారం, హత్య కేసులో నిందితుడు మంగళవారం ఎన్‌కౌంటర్‌లో మరణించగా, కొన్ని గంటల వ్యవధిలోనే ముర్షిదాబాద్‌లో బిజెపి కార్యకర్త హత్య కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఆగస్టు 28న బిజెపి కార్యకర్త సుజిత్ మోండల్ హత్యకు గురైన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సమౌల్ షేక్ మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటల ప్రాంతంలో ముర్షిదాబాద్ జిల్లాలో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించాడు. ఈ ఘటనకు సుమారు 12 గంటల ముందు ఉత్తర 24 పరగణాల జిల్లా గైఘాటాలో ఓ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రహ్లాద్ దాస్ కూడా ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. సుజిత్ మోండల్ హత్య కేసులో క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం సీఐడీ అధికారులు సమౌల్ షేక్‌ను సంషేర్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధూలియాన్‌కు తీసుకెళ్లినట్లు జంగీపూర్ పోలీస్ జిల్లా ఎస్పీ సురీందర్ సింగ్ తెలిపారు. ఈ సమయంలో సమౌల్ షేక్ ఓ పోలీసు అధికారి వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌ను లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించాడని, దీంతో జరిగిన ఎదురుకాల్పుల్లో అతడు మరణించాడని వివరించారు. ఈ ఘటనపై సీఐడీ అధికారులు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.బీడీ కార్మికుడైన బిజెపి కార్యకర్త సుజిత్ మోండల్ ఆగస్టు 28న కిడ్నాప్‌కు గురయ్యాడు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆయన మృతదేహం ముక్కలుగా లభ్యమైంది. ఈ కేసులో సమౌల్ షేక్, తజ్కిరా బీబీ, జానీ షేక్ సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదమే హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానించారు. నిందితుల్లో ఒకరైన సమౌల్‌షేక్‌ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నాలుగు నెలల్లో మూడు ఎన్‌కౌంటర్లు జరగడం గమనార్హం. రెండు నెలల క్రితం దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగిన సంగతి తెలిసిందే.



## దెబ్బతిన్న అణు కేంద్రాలకు ఇరాన్ మరమ్మత్తులు చేపట్టలేదు : ఐఎఇఎ

**న్యూయార్క్ :**
అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడుల్లో దెబ్బతిన్న అణు కేంద్రాలను మరమ్మతు చేయడానికి లేదా పునరుద్ధరించడానికి ఇరాన్ ప్రయత్నించినట్లు ఎలాంటి సంకేతాలు లేవని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) అధ్యక్షుడు రాఫెల్ గ్రోస్సీ తెలిపారు. మంగళవారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. దెబ్బతిన్న అణు కేంద్రాలతోపాటు ఇరాన్‌లోని అన్ని అణు స్థావరాలను తనిఖీ చేసేందుకు తమ అధికారులను అనుమతించాలని కోరారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తోందన్న ఆరోపణలతో అమెరికా ఆ దేశంపై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. 2025 జూన్‌లో అమెరికా జరిపిన దాడులు ఇరాన్ అణు కేంద్రాలను తీవ్రంగా దెబ్బతీశాయని గ్రోస్సీ పేర్కొన్నారు. అయితే, ఆ దాడుల తర్వాత ఇరాన్‌లో యురేనియం నిల్వల పరిస్థితిని ధ్రువీకరించలేకపోయామని ఐఎఇఎ తెలిపింది. 2025, 2026లో జరిగిన దాడుల్లో దెబ్బతిన్న అణు కేంద్రాల మరమ్మతులు లేదా పునర్నిర్మాణ పనులు చేపట్టినట్లు కూడా తమకు ఎలాంటి ఆధారాలు లభించలేదని గ్రోస్సీ వెల్లడించారు. అణు నిరాయుధీకరణ బాధ్యతలను ఇరాన్ ఉల్లంఘించిందని ఐఎఇఎ ప్రకటించిన నేపథ్యంలో, బహ్రెయిన్, డెన్మార్క్, లాట్వియా, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా మంగళవారం భద్రతా మండలి సమావేశానికి పిలుపునిచ్చాయి.అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి మౌనం వహించడాన్ని ఐరాసలో ఇరాన్ ఉప రాయబారి ఘోలమ్‌హొస్సేన్ దర్జీ తీవ్రంగా విమర్శించారు. ఇరాన్‌పై అమెరికా దురాక్రమణ సాగిస్తోందని అన్నారు. ఇరాన్ ప్రజలపై అమెరికా యుద్ధ నేరాలకు పాల్పడుతోందని విమర్శించారు. మరోవైపు, ఇరాన్ తన అణు కార్యకలాపాలపై ఐఎఇఎ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని అమెరికా ప్రతినిధి మైక్ వాల్ట్జ్ పేర్కొన్నారు. ఇరాన్ తన వాదనలను సమర్థించుకోవడం కంటే, సంస్థకు సహకరించి వాస్తవాలను వెల్లడించాలని అన్నారు.

## అమెరికాకు పారిపోయిన ఫ్లావియో బోల్సోనారో

**బ్రసీలియా :**
బ్రెజిల్ సెనెటర్ ఫ్లావియో బోల్సోనారో దేశం విడిచి అమెరికాకు పారిపోయినట్లు సంబంధిత వర్గాలు మంగళవారం తెలిపాయి. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా పాస్‌పోర్టులు అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, ఆయన ఆదేశాలను ఉల్లంఘించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. సోమవారం నాటికి పాస్‌పోర్టులు అప్పగించాలన్న గడువు ముగియడంతో అధికారులు సంబంధిత పత్రాలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఫ్లావియో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అయితే, ఆయన అధికారికంగా ఓటమిని అంగీకరించ లేదు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఫలితాలను రద్దు చేయాలని



డిమాండ్ చేశారు. మరోవైపు, ఆయనకు చెందిన లిబరల్ పార్టీ సోమవారం అధ్యక్షుడు లూలా విజయాన్ని గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. ఈ వ్యవహారంపై బ్రెజిల్‌లోని అమెరికా రాయబార కార్యాలయం స్పందించలేదు. ఫ్లావియో తరఫు న్యాయవాది కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఆయన అమెరికాలో ఎక్కడికి వెళ్తున్నారు? ఎప్పుడు అక్కడికి చేరుకుంటారు? రాజకీయ ఆశ్రయం కోరుతున్నారా? అనే అంశాలపై స్పష్టత లేదు. సాధారణ వలస మార్గం ద్వారా జైర్ బోల్సోనారో దేశం విడిచి వెళ్లలేదని బ్రెజిల్ ఫెడరల్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

2022 అధ్యక్ష ఎన్నికల్లో లూలా విజయాన్ని అంగీకరించడానికి నిరాకరించిన జైర్ బోల్సోనారో కూడా అమెరికాకు వెళ్లారు. అనంతరం బ్రెజిల్‌కు తిరిగి వచ్చారు. అయితే, బ్రసీలియాలోని ప్రభుత్వ భవనాలపై ఆయన మద్దతుదారులు దాడులకు పాల్పడిన ఘటనపై తిరుగుబాటుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై బోల్సోనారోకు 27 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బోల్సోనారో కుటుంబానికి అనధికారిక ప్రతినిధిగా వ్యవహరించే మితవాద ఇన్‌ఫ్లుయెన్సర్ పాలో ఫిగ్యురెడో సైతం ఫ్లావియో ఆచూకీపై ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు నిరాకరించారు.

## డీజిల్ ఒప్పందం రికార్డులు భద్రపరచండి

- బ్యాంకులు, ఓడరేవులకు అమెరికా సెనెటర్ల లేఖ

**చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**

**వాషింగ్టన్ :**
అమెరికా, రష్యా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ మధ్య కుదిరిన డీజిల్ సరఫరా ఒప్పందంపై భవిష్యత్తులో పార్లమెంటరీ దర్యాప్తు జరిపేందుకు వీలుగా దానికి సంబంధించిన అన్ని రికార్డులను భద్రపరచాలని డెమొక్రాట్ సెనెటర్లతో పాటు కొందరు రిపబ్లికన్ ప్రతినిధులు కూడా డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు అమెరికాలోని ప్రముఖ బ్యాంకులు, ప్రధాన ఓడరేవుల అధికారులకు అధికారికంగా లేఖలు పంపారు. లేఖలు అందుకున్న బ్యాంకుల్లో జేపీ మోర్గాన్ ఛేజ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ గ్రూప్, ఫార్గో, గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ ఉన్నాయి. న్యూయార్క్/న్యూజెర్సీ పోర్ట్



అథారిటీతో పాటు టెక్సాస్‌లోని హ్యూస్టన్ కార్పస్ క్రిస్టి, బ్యూమాంట్ రేవుల అధికారులకు కూడా లేఖలు అందాయి.2020లో అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన చట్టం ప్రకారం రష్యా నుంచి ఇంధన దిగుమతులపై స్పష్టమైన నిషేధం అమలులో ఉన్నదని సెనెటర్లు గుర్తు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని రష్యా పూర్తిగా ఆపేంతవరకూ ఈ నిషేధం అమలులో ఉండాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. రష్యా డీజిల్ కొనుగోలు, రవాణా, దిగుమతి, నిల్వ లేదా పంపిణీకి సహకరించే కంపెనీలు తీవ్రమైన సివిల్, క్రిమినల్ విచారణలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే 20 సంవత్సరాల వరకూ జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ట్రంప్‌పుతిన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రష్యా నుంచి తొలి డీజిల్ రవాణా నౌకలు ఇప్పటికే అమెరికా తీరానికి బయలుదేరాయని తెలుస్తోంది.బ్యాంకులు, ఓడరేవుల అధికారులకు రాసిన లేఖకు డెమొక్రాట్ సెనెటర్ జీన్ షాహీన్, రిపబ్లికన్ సెనెటర్ థామ్ టిల్లిస్ ప్రధాన సూత్రధారులు కాగా సెనెటర్లు క్రిస్ కూన్స్, ఎలిజబెత్ వారెన్, రాన్ వైడెన్, షెల్డన్ వైట్‌హౌస్, రిప్రజెంటింగ్ ప్రతినిధి గ్రెగరీ మీక్స్ దానిపై సంతకాలు చేశారు.కాగా రష్యా డీజిల్‌పై విధించిన ఆంక్షలను సడలించడాన్ని ట్రంప్ ప్రభుత్వం సమర్ధించుకుంది. దేశంలో పెరిగిన డీజిల్ ధరల భారాన్ని తగ్గించి రైతులు, సామాన్యులకు ఊరట కలిగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.



## సుడాన్‌లో డ్రోన్ దాడి.. 100 మందికి పైగా మృతి

హైదరాబాద్ : సూడాన్ సైన్యం, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. సోమవారం సాయంత్రం సౌత్ డార్ఫుర్‌లోని నైలా మార్కెట్‌పై సూడాన్ సైన్యం జరిపిన డ్రోన్ దాడిలో 100 మందికి పైగా సామాన్య ప్రజలు మరణించినట్లు స్థానిక వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనలో మరో 113 మంది గాయపడ్డారని సమాచారం. అధికార మార్పిడి, సైనిక విలీనం విషయంలో తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఇరు వర్గాలు పేలుడు డ్రోన్‌లను వినియోగించడంతో సామాన్య ప్రజలు తీవ్రంగా బలవుతున్నారు.

## స్మిత్ మచ్చర్‌కు యూఏఈ అరుదైన గౌరవం



ఫ్లైదుబాయ్ విమానం కూల్చివేత ప్రయత్నాన్ని ఇటీవల వీరోచితంగా అడ్డుకుని ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ) అరుదైన గౌరవం ఇచ్చింది. 'ఫస్ట్ క్లాస్ ఆర్డర్ ఆఫ్ జాయెద్ II' పురస్కారాన్ని ప్రకటించింది. ఆయనతో పాటు ప్రమాద సమయంలో విమానంలో ఉన్న ఫ్లైట్ సిబ్బందినీ సత్కరించింది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తరఫున యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్.. ఈ అవార్డును మచ్చర్‌కు ఇచ్చారు.సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన విమానం కాక్‌పిట్‌లో స్మిత్ మచ్చర్‌పై కోపైలట్ దాడి చేసిన ఘటన ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. తీవ్ర రక్తస్రావమై, కంటిచూపు మసకబారినా కెప్టెన్ ధైర్యాన్ని కోల్పోకుండా 170 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కాపాడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ సైతం మచ్చర్‌కు ఆ దేశ అత్యున్నత శౌర్య పురస్కారం 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం'ను ప్రకటించింది.

# డేటా సెంటర్లకు విద్యుత్.. గ్రామాలకు కష్టాలు

- ఏఐ విస్తరణతో అమెరికాలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్
- డేటా కేంద్రాల కోసం వందల మైళ్ల మేర హైటెన్షన్ లైన్ల నిర్మాణం
- రైతుల భూముల మీదుగా విద్యుత్ లైన్లు.. ఆస్తుల విలువ తగ్గుతుందని ఆందోళన
- లాభాలు ప్రయివేటుకు.. నష్టాలు మాకా' అంటూ గ్రామీణుల ఆగ్రహం
- మా భూములెందుకు త్యాగం చేయాలంటూ నిరసన

**వాషింగ్టన్:**
కృత్రిమ మేధ (ఏఐ) రంగం వేగంగా విస్తరిస్తుండటంతో అమెరికాలో డేటా సెంటర్లకు విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. ఈ అవసరాన్ని తీర్చేందుకు వందల మైళ్ల దూరంలోని గ్రామీణ ప్రాంతాల మీదుగా భారీ విద్యుత్ లైన్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో తమ భూములు, ఇండ్లు, పర్యావరణం దెబ్బతింటాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు కంపెనీల వ్యాపార అవసరాల కోసం తమ ఆస్తులను త్యాగం చేయాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లాభాలు డేటా సెంటర్లకు, నష్టాలు తమకు మిగులుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో ఉన్న లౌడౌన్ కౌంటీలో ప్రపంచంలోనే అత్యధికంగా డేటా సెంటర్లు ఉన్నాయి. సుమారు 230 డేటా సెంటర్లు, 56 మిలియన్ చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో పనిచేస్తున్నాయి. వీటికి విద్యుత్ సరఫరా చేయడానికి వర్జీనియా, వెస్ట్ వర్జీనియా, మేరీల్యాండ్ రాష్ట్రాల మీదుగా కొత్త విద్యుత్ లైన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో వ్యాలీ లింక్ ప్రాజెక్టు ప్రధానమైనది. 765 కిలో ఓల్టుల సామర్థ్యంతో, సుమారు 260 మైళ్ల పొడవున భారీ స్తంభాలతో ఈ లైన్ నిర్మించనున్నారు. మరో 116 మైళ్ల లైన్ కూడా ప్రతిపాదనలో ఉంది. మార్ల్ పేరుతో మరో 500 కిలో ఓల్టుల విద్యుత్ లైన్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఈ లైన్ల నిర్మాణం వల్ల తమ భూముల విలువ పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెస్ట్ వర్జీనియాలోని తన 70 ఎకరాల వ్యవసాయ క్షేత్రం మీదుగా విద్యుత్ లైన్



వెళ్లనుండటంతో క్యాట్ కెమ్మెర్లింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి పరిహారం ఇచ్చినా, దాని మొత్తం విలువ తగ్గిపోవడానికి అది సరిపోదన్నారు. "మేం లౌడౌన్‌కు విద్యుత్ అందించే పొడిగింపు తీగలుగా మారుతున్నాం. కానీ మాకు ఎలాంటి ప్రయోజనం లేదు" అని ఆమె వ్యాఖ్యానించారు. అమెరికాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు. స్థానిక సంస్థలు తీర్మానాలు చేస్తున్నాయి. న్యాయవాదులను నియమించుకుని ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రజల నిరసనలతో విద్యుత్ లైన్ల మార్గాలను మార్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే, ప్రజా ప్రయోజనాల పేరుతో ప్రభుత్వం ప్రయివేటు భూములను స్వాధీనం చేసుకునే అధికారం కలిగి ఉండటంతో, స్థానికుల అభ్యంతరాలకు పరిమిత అవకాశాలే ఉన్నాయి. 2021 నుంచి 2025 మధ్య లౌడౌన్ కౌంటీలో విద్యుత్ వినియోగం 233 శాతం పెరిగి ఐదు గిగావాట్లకు పెరిగింది. 2030 నాటికి ఏఐ అవసరాల కారణంగా ఈ డిమాండ్ 20 నుంచి 30 గిగావాట్లకు చేరవచ్చని అంచనా. ఇప్పటికే కొన్ని డేటా సెంటర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి ఏడాది లేదా అంతకంటే ఎక్కువ సమయం పడుతోంది. గత జులైలో విద్యుత్ లైన్‌లో పరికరం విఫలం కావడంతో కొన్ని డేటా సెంటర్లు బ్యాకప్ విద్యుత్‌కు మారాయి. ఫలితంగా గ్రిడ్‌పై ఒక్కసారిగా 3,000 మెగావాట్ల డిమాండ్ తగ్గి, చికాగో నుంచి మయామి వరకు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయి. డేటా సెంటర్లు పన్నుల ద్వారా స్థానిక అభివృద్ధికి నిధులు అందిస్తున్నాయని వాటి అనుకూల వర్గాలు చెప్తున్నాయి. ఆరోగ్య సేవలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, క్లౌడ్ నిల్వ వంటి అవసరాలకు కూడా ఇవి కీలకమని వివరిస్తున్నాయి. అయితే, ఏఐ విస్తరణతో విద్యుత్ అవసరాలు మరింత పెరుగుతుండటంతో, కొత్త డేటా సెంటర్లకు అనుమతులు ఇవ్వాలా వద్దా అన్న చర్చ తీవ్రమవుతోంది. న్యూయార్క్ రాష్ట్రం డేటా సెంటర్లపై తాత్కాలిక నిషేధం విధించగా, వర్జీనియాలోనూ అలాంటి డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## చెట్లు నరకొద్దు



**ట్రంప్ గోల్ఫ్ కోర్సుకు యూఎస్ జడ్జి ఆదేశం**

**వాషింగ్టన్ :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన చారిత్రక వాషింగ్టన్ గోల్ఫ్ కోర్సులో చెట్లను నరకవద్దని అమెరికా ఫెడరల్ జడ్జి ఒకరు ఆదేశించారు.
గోల్ఫ్ కోర్సు పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఇప్పటికే అక్కడ కనీసం 400 చెట్లను తొలగించారు. ఈ నేపథ్యంలో యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి అనా రేయస్ సోమవారం తాజాగా ఆదేశాలు జారీ చేస్తూ ఇకపై చెట్ల నరికివేతను ఆపేయాలని స్పష్టం చేశారు. గోల్ఫ్ కోర్సు ప్రాంతంలో శాశ్వత మార్పులు చేపట్టదలచుకుంటే పది రోజుల ముందుగా లిఖితపూర్వక నోటీసు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. న్యాయపరమైన సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ 106 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈస్ట్ పొటోమాక్ గోల్ఫ్ కోర్సులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ట్రంప్ సన్నాహాలు చేస్తున్నారు. గోల్ఫ్ కోర్స్ ప్రాజెక్ట్ పనులను వ్యతిరేకిస్తున్న ప్రజలకు హెచ్చరికలు జారీ చేయకుండానే కార్మికులు వందలాది చెట్లను నరకడంతో వివాదం చెలరేగింది. దీనిపై డీసీ ప్రిజర్వేషన్ లీగ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఆధునీకరణ పనుల కారణంగా వాషింగ్టన్ చరిత్రలోని ముఖ్యమైన భాగానికి నష్టం వాటిల్లుతుందని వాదించింది. పునరుద్ధరణ పనుల విషయంలో ప్రభుత్వం పర్యావరణ చట్టాలను అనుసరిస్తోందా అని ప్రశ్నించింది.

## రైతులకు గుడ్‌న్యూస్..ఖాతాల్లోకి పీఎం కిసాన్ డబ్బులు



**హైదరాబాద్ :**
పీఎం కిసాన్ 24వ విడత నిధులను అక్టోబర్ 30న విడుదల చేయనుంది. దీంతో అర్హులైన రైతుల ఖాతాల్లో ఎల్లుండి రూ.2,000 చొప్పున జమ కానున్నాయి. ఈ స్కీమ్ కింద కేంద్రం రూ.2 వేల చొప్పున ఏడాదికి 3 విడతల్లో మొత్తంగా రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తోన్న విషయం తెలిసిందే. 24వ విడత ద్వారా 9.44 కోట్ల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరనుంది. కాగా ఈకేవైసీ చేసుకున్న రైతులకే ఈ డబ్బులు జమకానున్నాయి.

## అర్నబ్ తుపాను బీభత్సం:ఈదురుగాలులు,వర్షాల దాటికి ఏడుగురు మృతి

**హైదరాబాద్: '**
అర్నబ్'తుపాను ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలో తీరని నష్టాన్ని మరియు తీవ్ర బీభత్సాన్ని సృష్టించింది. గంటకు తీవ్ర వేగంతో వీచిన ఈదురుగాలుల ధాటికి పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెట్లు,విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి.ఈ ప్రమాదకరమైన ఘటనల్లో వేర్వేరు చోట్ల మొత్తం ఏడుగురు వ్యక్తులు తమ ప్రాణాలు కోల్పోయారు.

విశాఖపట్నం పాత గోశాల సమీపంలో అలాగే బాలాజీనగర్‌లో విద్యుత్తు స్తంభాలు కూలిన వేర్వేరు ఘటనల్లో కె.మాధవితో పాటు మరొక మహిళ దుర్మరణం చెందారు.ఇక పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో తుపాను తాకిడికి షాపులు,ఇళ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి.భీమవరంలోని ఒక చర్చి వద్ద చెట్టు విరిగిపడి చొక్కా కిషోర్ (45)మృతి చెందగా,బొండాడవారివీధిలో విద్యుత్తు స్తంభం విరిగిపడటంతో రాంబాబు (34)ప్రాణాలు కోల్పోయారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం ప్రకాష్‌పురంలో ఒక వృద్ధురాలు మృతి చెందగా,ఇదే జిల్లాలో ఈదురుగాలులు మరియు ఈగాలి వర్షానికి నివాసముంటున్న గుడిసె కూలిపోవడంతో కొల్లు వెంకాయమ్మ తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయారు.అటు అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో తీవ్ర గాలివానకు విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడిపోగా,ఉదయాన్నే ప్రమాదవశాత్తూ ఇంటి ముందున్న ఆ తీగలను తాకి ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందారు.



# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఎస్ఐఆర్–2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 28, 2026:**

మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) జె.ఎల్.బి. హరిప్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్-2026) పురోగతిని సమీక్షించారు .ఈ సమావేశంలో జడ్చర్ల మండల డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 28.10.2026 నాటికి ఎస్ఐఆర్-2026లో భాగంగా నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ పురోగతిని ఈఆర్ఓ సమీక్షించారు. ఇప్పటివరకు 99.74 శాతం నోటీసుల పంపిణీ, 98 శాతం విచారణలు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా విచారణలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, ఏఈఆర్ఓల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆమోదించిన, తిరస్కరించిన దరఖాస్తుల జాబితాలను సిద్ధం చేసి, ప్రజల సమాచారార్థం నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని, వాటి ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్-2026కు సంబంధించిన సమాచారాన్ని, కార్యకలాపాలను సక్రమంగా నమోదు చేసి, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు.సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి, వారి సందేహాలను ఈఆర్ఓ నివృత్తి చేశారు. ఎస్ఐఆర్-2026లో భాగంగా నోటీసుల జారీ, విచారణల ప్రక్రియ 05.11.2026తో ముగియనున్నట్లు, తుది ఓటరు జాబితాను 09.11.2026న ప్రచురించనున్నట్లు తెలిపారు.అర్హులైన ఓటర్లు విచారణలకు హాజరయ్యేలా, ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈఆర్ఓ కోరారు. సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పారదర్శకంగా, సజావుగా పూర్తి చేయాలని సూచించారు.

## పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా కేంద్రంలో భారీ సైకిల్ ర్యాలీ
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి )**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో (పోలీస్ ఫ్లగ్ డే2026) భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజలు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తూ భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ ఆర్డీఓ ఆఫీస్, పాత బస్టాండ్, మెయిన్ చౌక్, సుభాష్ రోడ్, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి రోడ్డు, జిశాన్ హోటల్, అంబేద్కర్ చౌరస్తా, మున్సిపల్ పార్క్ మీదుగా తిరిగి ఎస్పీ కార్యాలయం పరేడ్ మైదానం వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో దేశ భక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించే సందేశాన్ని చాటిచెప్పారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, సమాజంలో నేరాల నియంత్రణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం దేశంలో 154 ప్రాణాలు త్యాగాలు చేశారని వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యత అని అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నిర్వహణ ప్రధాన ఉద్దేశం అమరవీరుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేయడంతో పాటు, వారి సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించడం అని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాల త్యాగాలను కూడా సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన అమరవీరుల త్యాగాలకు సమాజం గౌరవం తెలపాలని పేర్కొన్నారు.పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావడానికి, పోలీసుల విధులు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖ నిర్వహించే ప్రజా భద్రతా కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.సైకిల్ ర్యాలీలు ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ కాలుష్య నియంత్రణకు కూడా ఉపయోగపడతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరాలు, కొవ్వొత్తుల ర్యాలీల ద్వారా అమరవీరుల త్యాగాలను ప్రజలకు చేరవేస్తూ, పోలీస్-ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐలు శివ శంకర్ రామ్ లాల్ భగవంత్ రెడ్డి, సైదులు, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు సతీష్ రెడ్డి, విజయ్ కుమార్, చంద్ర శేఖర్, పురుషోత్తం, భాగ్య లక్ష్మీ రెడ్డి, కృష్ణం రాజు, రాజు, ఎస్ ఎం నవీద్, మహేందర్ రెడ్డి, గాయత్రి, రేవతి శిరీష, శివ శంకర్ రామ్ లాల్,రమేష్ తది తరులు పాల్గొన్నారు.






## పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 28 (వుదయం బ్యూరో):**

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.

కొల్లాపూర్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సుమారు రూ.40.06 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పర్యాటక శాఖకు చెందిన 16 అభివృద్ధి పనులను వెంటనే ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేయాలని సూచించారు.

బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పర్యాటక, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించాలని, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలని తెలిపారు.

పనుల బదిలీకి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో టూరిజం డీఈలు పరుష వేది, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఈ నాగార్జున గౌడ్, పంచాయతీరాజ్ డీఈ విజయ్ కుమార్, టూరిజం అధికారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా మేధావుల సదస్సు

- కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్

**నారాయణపేట అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి )**



ప్రజాస్వామ్య పరిరక్షణ కోసంనవంబర్ 1వ తేదీ ఆదివారం నాడు ఉదయం 11 గంటలకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో శాస నపల్లి రోడ్ లోని లక్ష్మీ బాంకెట్ హాల్ లో మేధా వుల సదస్సు నిర్వహిస్తు న్నట్లు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేధావుల సమావేశానికి, సమాజంలోని డాక్టర్లు న్యాయవా దులు లెక్చరర్లు టీచర్లు కుల సంఘాల నాయకులు వ్యాపార వర్తకులు ఇతరే తర మేధావి వర్గాల అందరికీ ఇదే మా ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. దేశ విచ్చిత్తికి ప్రజాస్వామ్య అపహస్యానికి వివిధ రకా ల పేర్లతో విదేశీ నిధులతో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన వ్యవస్థలను కూల్చి వేయడానికి సిద్ధ మవుతున్న వేళ మేధావు లు కదలివచ్చి మేధావుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మేధావుల సమావేశాన్ని జయప్రదం చేయాలనీ కోరారు.

## సంగారెడ్డి కోర్ట్ ఐలు నూతన కార్యవర్గం ఎన్నిక



**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కోర్టు నూతన ఐలు కార్యవర్గాన్ని ఈ రోజు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ హాజరయ్యారు. సంగారెడ్డి కోర్ట్ అధ్యక్షులుగా కె. నాగ భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఎల్. దేవదాస్ నాయక్, వినీలా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లాడే ఉదయ్, సహాయ కార్యదర్శిగా భూపాల్ రెడ్డి, మల్లేశం, కోశాధికారిగా బి. లక్ష్మి, స్పోర్ట్స్ సెక్రటరీగా కే. సుభాష్ చంద్ర, ఉమెన్ ఆర్గనైజర్ కె. అరుణ కుమారి, పబ్లిక్ రిలేషన్ గా టి. ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా టి. రత్నాకర్, ఆర్. వెంకటేశం, కమిటీ సభ్యులుగా సదానందం, జి. సుధాకర్ గౌడ్, సురేష్ కుమార్, చందర్ నాయక్, కే.సుమిత్ర, డి. సాయి శ్రీ, నాగిశెట్టి, చిరంజీవి, సురేష్, దత్తాత్రి, మొహమ్మద్ రహీముద్దీన్, దామోదర్, బస్వరాజ్, సింధుజ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు కే. నాగ భాస్కర్, లాడే ఉదయ్ మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐలు సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని తెలిపారు.

## పాండుచెరువు వద్ద సీసీ పనులు ప్రారంభం



- ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు : మున్సిపల్ ఛైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు

**రామాయంపేట,అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని పాండుచెరువు కట్ట వద్ద ఉన్న కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సీసీ పనులను మంగళవారం ప్రారంభించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రాంగణంలో సీసీ పనులు చేపట్టడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ పరిసరాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ పాలకవర్గం పేర్కొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, పాలకవర్గానికి ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు దాకి శ్యామల స్వామి, శంకర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల యువత చూపు.. జన సైనికుడి వైపు!

- యువతకు అండగా నిలుస్తూ.. సేవా కార్యక్రమాలతో ముందుకు
- క్రీడలకు ప్రోత్సాహం.. పేదలకు సహాయం.. ప్రజాసేవే లక్ష్యంగా అడుగులు

**జడ్చర్ల: అక్టోబర్ 28, వుదయం**



నియోజకవర్గ రాజకీయాల్లో యువత పాత్ర కీలకంగా మారుతున్న వేళ.. యువత అవసరాలను గుర్తిస్తూ, వారికి అండగా నిలిచే నాయకత్వం వైపు పలువురి దృష్టి మళ్లుతోంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద సేవకుడు జర్పుల భాస్కర్ నాయక్ పేరు చర్చకు వస్తోంది. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఆయన, వివిధ సేవా కార్యక్రమాలతో తనదైన గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారు. యువతకు ప్రోత్సాహం.. క్రీడలకు చేయూత యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఆలోచనతో జడ్చర్ల ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు జర్పుల భాస్కర్ నాయక్ రూ.30 వేల విరాళం అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. యువత నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించడం ద్వారా వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేశారు.

సేవా కార్యక్రమాలే గుర్తింపుగా..

పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, వైద్య అవసరాల్లో అండగా నిలవడం, విద్యార్థులకు తోడ్పాటు, గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు సహకరించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ భాస్కర్ నాయక్ ముందుకు సాగుతున్నారు. అవసరంలో ఉన్నవారికి సాధ్యమైనంత సహాయం చేయాలనే ఉద్దేశంతో చేపడుతున్న కార్యక్రమాలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి.రాజకీయాల్లో యువత ఆశలు.. నాయకత్వంపై ఆసక్తిజడ్చర్ల నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు, క్రీడా వసతులు, విద్య, వైద్య సదుపాయాలు వంటి అంశాలు ముఖ్యమైనవిగా నిలుస్తున్నాయి. ఈ అవసరాలపై స్పందిస్తూ యువతతో మమేకమయ్యే నాయకత్వం కోసం చాలామంది ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో భాస్కర్ నాయక్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే సేవా కార్యక్రమాల ద్వారా ఏర్పడే పరిచయాలు రాజకీయ మద్దతుగా ఎంతవరకు మారుతాయనేది భవిష్యత్తులో తేలాల్సి ఉంది. యువతలో ఆయనకు ఉన్న ఆదరణ, ప్రజా సమస్యలపై స్పందించే తీరు, నిరంతర ప్రజాసంబంధాలు ఆయన తదుపరి ప్రయాణంలో కీలకం కానున్నాయి.సేవ నుంచి రాజకీయ ప్రస్థానం వైపు?

ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను వినడం, అవసరమైన సమయంలో అండగా నిలవడం ఏ నాయకుడికైనా ముఖ్యమైన లక్షణాలు. జర్పుల భాస్కర్ నాయక్ కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ యువతతో తన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సేవా ప్రస్థానం భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ మలుపు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి.. జడ్చర్లలో యువతకు చేయూతనిస్తూ, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతున్న జర్పుల భాస్కర్ నాయక్ తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించగలిగితే, ఆయన రాజకీయ ప్రస్థానానికి అవి పునాదిగా మారే అవకాశం ఉంది.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులు అందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి*

**వనపర్తి అక్టోబర్ 28\ (వుదయం ప్రతినిధి)**




ఫారం-18 ద్వారా నవంబర్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి*

రానున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 31వ తేదీకి ముందు పట్టభద్రులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.

అర్హులైన పట్టభద్రులు 2026 నవంబర్ 6వ తేదీలోగా ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, లేదా సంబంధిత ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

జిల్లాలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే జైలుకే..

- 71 మందికి కోర్టు శిక్షలు
- ఒకరికి 14 రోజుల జైలు
- 2.02 లక్షల జరిమానా వసూలు
- మద్యం సేవించి వాహనాలు నడపరాదు
- ట్రాఫిక్ సీఐ శివశంకర్ హెచ్చరిక

**వుదయం ప్రతినిధి,కీసర అక్టోబర్ 28**





మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన 71 మందికి కుషాయిగూడలోని 5వ స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టు జరిమానాలు,జైలు శిక్షలు విధించింది.అక్టోబర్ నెలలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి మొత్తం రూ.2,02,500 జరిమానాలు విధించినట్లు జవహర్‌నగర్ ట్రాఫిక్ సీఐ కే. శివశంకర్ తెలిపారు.ఒకరికి రూ.2 వేల జరిమానాతో పాటు గరిష్ఠంగా 14 రోజుల జైలు శిక్ష,మరో వ్యక్తికి రూ.4 వేల జరిమానాతో పాటు నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ.. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్ ప్రాణాలకే కాకుండా రోడ్డుపై ప్రయాణించే అమాయక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఇతర వాహనదారులు,పాదచారుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని హెచ్చరించారు.రోడ్డు ప్రమాదాలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతాయని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జహీరాబాద్ అభివృద్ధే ధ్యేయంగా సి సి రోడ్లు సీసీ డ్రైన్స్ శంకుస్థాపన చేసిన ఎంపీ

**ఝరాసంగం అక్టోబర్-28(వుదయం ప్రతి నిధి )**



జహీరాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో 5.16కోట్లా సీసీ రోడ్లు & సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ శ్రీ సురేష్ కుమార్ షెట్కార్ గారు

మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇంచార్జ్ డా||ఏ.చంద్రశేఖర్ గారు

జహీరాబాద్ మున్సిపాలిటీ టౌన్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టిన 5.16 కోట్లా సీసీ రోడ్ల మరియు సీసీ డ్రైన్స్ నిర్మాణ పనుల ద్వారా ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, పట్టణ అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ సీసీ రోడ్లు మరియు సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులతో పలు వార్డుల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందనున్నాయి.ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావడం, పట్టణంలోని ప్రతి వార్డుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించడం కాంగ్రెస్ ప్రజా పాలన లక్ష్యం..

వార్డుల వారిగా సీసీ రోడ్లు & సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులు:– 2,3,7,10,13,21,22,26,27,32 ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మెన్ గిరిధర్ రెడ్డి గారు, జహీరాబాద్ మునిసిపల్ ఛైర్మెన్ యూనుస్ గారు, సీడీసీ. ఛైర్మెన్ ముబీన్ గారు,కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి గారు,మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు,మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్ గారు,కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## సీపీఎం పార్టీ పోరాట ఫలితంగా అచ్చంపేట మండలాని కరువు మండలంగా గుర్తింపు – హర్షం

- అచ్చంపేట మండల కార్యదర్శి వర్దం సైదులు

**అచ్చంపేట, అక్టోబర్ 28: (వుదయం ప్రతినిధి )**




మండలాన్ని కరువు మండలంగా గుర్తించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలు, రైతుల పక్షాన చేసిన ఆందోళనల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అచ్చంపేట మండలాన్ని కరువు మండలంగా గుర్తించడం పట్ల సీపీఎం పార్టీ అచ్చంపేట మండల కమిటీ హర్షం వ్యక్తం చేస్తోంది.

అచ్చంపేట మండలంలోని రైతులు వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు సాగు చేసిన రైతులు పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితుల్లో ఆర్థికంగా నష్టపోతున్నారని సీపీఎం పార్టీ పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రైతుల సమస్యలను పరిష్కరించాలని, అచ్చంపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని పార్టీ నిరంతరం పోరాటం చేసింది. సీపీఎం పార్టీ పోరాటాల ఫలితంగా అచ్చంపేట మండలాన్ని కరువు మండలంగా గుర్తించడం రైతులకు ఊరటనిచ్చే పరిణామం. ప్రభుత్వం కరువు నిబంధనల ప్రకారం అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందించాలని, పంట రుణాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తోంది.అచ్చంపేట మండల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మండలాన్ని కరువు మండలంగా గుర్తించే ప్రక్రియలో సహకరించిన స్థానిక ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ గారికి సీపీఎం పార్టీ అచ్చంపేట మండల కమిటీ తరఫున వర్దం సైదులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతులకు న్యాయం జరిగే వరకు, వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందే వరకు సీపీఎం పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## పేద విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించిన ఉపాధ్యాయుడు

- 49 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.7,250 ఆర్థిక సాయం

**దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 28, వుదయం:**



పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉదారత చాటుకున్నారు. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధర్మారం దశరథం పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులను చెల్లించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. మిరుదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న 49 మంది విద్యార్థులకు సంబంధించిన రూ.7,250 పరీక్ష ఫీజును పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రామలింగం కు అందజేశారు. పేద విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ సహాయం చేసినట్లు దశరథం తెలిపారు. ప్రస్తుతం దౌల్తాబాద్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దశరథం.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చేసిన ఈ సహాయం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు అందె రామచంద్రం, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, ధర్మారం కుమార్, ధర్మారం నర్సింలు, నేరండ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే మనోహరన్న పరామర్శ

-తాండూరు, యాలాల మండలాల్లో బాధిత కుటుంబాలకు అండగా బీఎంఆర్

**తాండూరుఅక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)**



తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బుధవారంతాండూరు మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన మదనంతు మణెమ్మ, బత్తెపు వెంకటప్ప, మాజీ ఉపసర్పంచ్ పకిరప్ప కుటుంబాలను ఆయన వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. యాలాల మండలం జక్కేపల్లి గ్రామంలో రావుల మల్కప్ప కుటుంబాన్ని, తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో జావీద్ సాహెబ్ కుటుంబాన్ని కలిసి ఓదార్చారు.మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం వారి కుటుంబానికి నా వంతు సహాయంగా అందిస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కర్ణం పురుషోత్తం రావు, తాండూర్ మండల పార్టీ అధ్యక్షుడు రాజకుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్ మాజీ డిసిసిపి చైర్మన్ రవీందర్ గౌడ్, నారాయణపూర్ కాంగ్రెస్ నాయకులు రాజు పాల్గొన్నారు



# అక్కన్నపేట మండల రజక సంఘ అధ్యక్షుడిగా రఘుపతి

**హుస్నాబాద్ వుదయం (అక్టోబర్ 28)**

అక్కన్నపేట మండలం రజక సంఘం ఎన్నికలు బుధవారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధీటి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతకపేట గ్రామానికి చెందిన జంగపల్లి రఘుపతి మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఊల్లెంగుల రాజు, ప్రధాన కార్యదర్శిగా తంగళ్ళపల్లి పరుశురాములు, కార్యదర్శిగా కొలిపాక అశోక్, కోశాధికారిగా వంగపల్లి రాజు, ప్రచార కార్యదర్శిగా పాంద్రాల మోహన్ బాబు, కార్యవర్గ సభ్యులుగా బందారం రమేష్, వంగపల్లి సమ్మయ్య, తంగళ్ళపల్లి రమేష్, కొలుగూరి అజయ్, కోలిపాక రమేష్, జంగపల్లి రాజశేఖర్, కొలుగూరి కుమార్, నాంపల్లి పోచయ్య, గంపల బాలయ్య, జంగపల్లి రవీందర్ పరుశురాములు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి రాష్ట్ర, జిల్లా నాయకులు నియామక పత్రాలు అందజేసి మాట్లాడుతూ,రాష్ట్రంలో రజకులు అనేక రంగాల్లో వెనుకబడి పోతున్నారని అన్నారు. కులావృత్తి చేసుకునే రజకులపై అనేక దాడులు జరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళలు ఇండ్లలో పనిచేసే సమయంలో అఘాయిత్యాలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా బీసీఏలో రజకులతో పాటు 56 కులాలు ఉన్నాయని, వీరంతా సంచార జాతులని, ఇప్పుడిప్పుడే చదువుకొని ముందుకు వస్తున్న వీరు అంబేద్కర్ అందించిన రిజర్వేషన్ అనుభవిస్తూ ఉన్నారని అన్నారు. ఇలా వెనుకబడిన జాతులు ఉన్న బీసీఏలో, ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా బలంగా ఉన్న ముదిరాజులను కలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం దారుణమని అన్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పండుగ సాయన్న జయంతిలో ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా 36లక్షలకు పైగా బీసీ ఏ లో కొనసాగుతున్న సంచార జాతులమంతా ఒక్కటై తిరుగుబాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నూతన ఓటర్ల ఆన్‌లైన్ నమోదు కార్యాలయం ప్రారంభం



**కేశంపేట**

మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ అన్నారు. మండల పరిధిలోని పుటోనో గూడ గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు,వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రామానికి వచ్చిన నూతన బస్సు ను మండల నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలతో పాటు రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. బస్సు సౌకర్యం లేని గ్రామాలకు తండాలకు విడతల వారీగా కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్,గ్రామ సర్పంచ్ భాస్కర్ నాయక్,నాయకులు కరుణాకర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఇబ్రహీం,నాగేశ్వర్ గ్రామస్తులు పాల్గొన్నారు...



# అహ్మద్‌గూడలో డ్రైనేజీ సమస్యకు మోక్షం

**అహ్మద్‌గూడలో డ్రైనేజీ సమస్యకు మోక్షం**

**వుదయం ప్రతినిధి, కీసర అక్టోబర్ 28,**

కీసర సర్కిల్ పరిధిలోని అహ్మద్ గూడ గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులకు శ్రీకారం చుట్టారు.బుధవారం ఆనందతీర్థనగర్ కాలనీ,భవానీ శంకర్ నగర్ కాలనీలలో సుమారు రూ.10.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు.ఈ పనుల ద్వారా కాలనీల్లో డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభించనుంది.ఈ సందర్భంగా యూజీడీ పనుల ఏర్పాటుకు సహకరించి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ కు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు,మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్,సంజీవరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,శ్రవణ్ రెడ్డి,గౌస్,దుర్గాప్రసాద్ గౌడ్,సుమేష్,సమ్మిరెడ్డి,శ్రీలత, బాలమణి,దిలీప్,జగన్,కిట్టు,బజరంగ్,జహంగీర్,గోపి,నాగరాజు,కాలనీవాసులు,తదితరులు,పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ కంటోన్మెంట్, అక్టోబర్ 28: వూదయం ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి గౌరవ శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ గారు బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కలకాలం జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. భగవంతుడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, మనశ్శాంతి, మరింత శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు తెలిపారు

# సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

**కాప్రా డివిజన్‌లో రూ.2.50 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





- **ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం**

**కాప్రా (వూదయం ప్రతినిధి) అక్టోబర్ 28,**

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కాప్రా డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో మొత్తం రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీలలో రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

కాప్రా డివిజన్‌లో కాలనీల వారీగా సీసీ రోడ్ల పనుల వివరాలు:

1. సైనిక్ ఎన్‌క్లేవ్ - రూ.27 లక్షలు
2. భాస్కర్ రావు నగర్ - రూ.50 లక్షలు
3. సాయిబాబా ఆఫీసర్స్ కాలనీ - రూ.27 లక్షలు
4. ఆకాశ్ జోసెఫ్ కాలనీ - రూ.46 లక్షలు
5. సాయిపురి కాలనీ - రూ.50 లక్షలు
6. ఆర్‌కే ఎన్‌క్లేవ్ - రూ.50 లక్షలు

మొత్తం పనుల విలువ: రూ.2.50 కోట్లు

ఈ సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే ఆయా కాలనీల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, రహదారుల సమస్యలకు పరిష్కారం లభించనుంది.

ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్ ,అధికారులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కన్నీటి సాక్షిగా.. పశువుల మేతగా మారిన వరిచేను!

- **కరువు జాబితా నుంచి కొందుర్గు మినహాయింపుపై రైతుల ఆందోళన**
- **ఎండిన ఆశల వరి.. పశువుల నోటికి మేతగా మారి..**
- **నీరు లేక పైరు నీరసించెను.. కన్నీటితో రైతు కలలన్నీ కరిగిపోయే!**

**షాద్‌నగర్, అక్టోబర్ 28,(వుదయం):**

అన్నం పెట్టాల్సిన పొలమే నేడు పశువులకు పచ్చికగా మారింది. గుండె నిండా నమ్మకం పెట్టుకుని, చెమట చుక్కను నీరుగా మార్చి పెంచిన పంట.. సాగునీరు అందక చేతికందే సమయానికి ఎండుముఖం పట్టింది. పండితే నాలుగు గింజలు నోట్లోకి వెళ్తాయనుకున్న రైతుకు, ఎండిన పైరును చూసి కన్నీళ్లే దిక్కయ్యాయి. దిగుబడి రాని పంటను చూస్తూ ఉండలేక, కోత ఖర్చులు కూడా రావని తేలిపోవడంతో.. కంటికి రెప్పలా కాపాడుకున్న వరిచేనును కంటిముందే పశువుల మేతకు వదిలేశాడు ఆ అన్నదాత. నాటిన నాటు నుంచి నేటి వరకు పడిన కష్టమంతా వృథా కావడంతో రైతు గుండెకోత వర్ణనాతీతంగా మారింది.

క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు..

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో కొందుర్గు మండలం వ్యవసాయ రంగంపై అత్యధికంగా ఆధారపడిన ప్రాంతంగా మొదటినుంచి





గుర్తింపు ఉంది. ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలిస్తే పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. కొందుర్గు మండలంలో వరి 4,910 ఎకరాలు, మొక్కజొన్న 4,864 ఎకరాలు, పత్తి 743 ఎకరాలు, కంది 700 ఎకరాలు, జొన్న 30 ఎకరాలు, ఇతర కూరగాయలు 600 ఎకరాలకు పైగా సాగయ్యాయి. కానీ, ప్రస్తుతం ఈ పంటలు చేతికొస్తాయనే నమ్మకం ఏమాత్రం లేదు.

మండల పరిధిలోని బేరంపల్లి గ్రామానికి చెందిన రైతు పెంటయ్య ఒక ఎకరన్నార పొలంలో వేసిన వరి పూర్తిగా దెబ్బతినడంతో, దిక్కుతోచని స్థితిలో దానిని పశువులకు మేతగా వదిలేశాడు. ఇలా మండలంలో అనేక మంది రైతులు తాము సాగు చేసిన పంటలపై నమ్మకం కోల్పోయి నిరాశలో కూరుకుపోయారు.

ఎల్నినో ప్రభావం.. కరువు జాబితాలో నిరాశ

రాష్ట్రవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం షాద్‌నగర్ నియోజకవర్గంపై తీవ్రంగా పడింది. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఫరూక్‌నగర్, కొత్తూరు, చౌదరిగుడ తదితర మండలాలు చోటు దక్కించుకున్నాయి. అయితే, వాటితోపాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొందుర్గు, నందిగామ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది.

వ్యవసాయంపైనే పూర్తిగా ఆధారపడిన కొందుర్గు మండలాన్ని తాజా కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యపు తప్పుడు నివేదికల వల్ల ప్రభుత్వం ఈ మండలాన్ని విస్మరించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తుండగా, నష్టపోయిన రైతన్నలకు తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రక్తదానం.. 102 మందికి ప్రాణదానం

- **ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో మెగా రక్తదాన శిబిరం..**

**అమరవీరులకు ఘన నివాళి**

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (వుదయం):**

రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందించి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే వీక్-2026, అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఆదేశాల మేరకు, మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి, మహేశ్వరం డివిజన్ ఏసీపీ జానకిరెడ్డి పర్యవేక్షణలో ఆమనగల్లు పోలీస్ స్టేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ శిబిరంలో యువత, పోలీసు సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు స్వచ్ఛందంగా రక్తదానం చేయగా మొత్తం 102 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు తరలించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్య నాయక్, జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే వీక్‌లో భాగంగా ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన స్వర్గీయ హనుమంత్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు సహకరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మహిళల భద్రతపై



అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాతలను డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రక్తదాతలు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, పోలీసు సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, యువత, విద్యార్థులు, మీడియా ప్రతినిధులకు ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ కృతజ్ఞతలు తెలిపారు.

# సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

- **మచ్చ బొల్లారం డివిజన్‌లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**
- **మచ్చ బొల్లారం, అక్టోబర్ 28: వూదయం ప్రతినిధి**

మచ్చ బొల్లారం డివిజన్‌లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మచ్చ బొల్లారం, అక్టోబర్ 28: వూదయం ప్రతినిధి మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మచ్చ బొల్లారం డివిజన్‌లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు ఈరోజు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు, కాలనీవాసుల సమక్షంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ప్రెసిడెన్సీ అవెన్యూలో రూ.16 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభంమచ్చ బొల్లారం డివిజన్‌లోని ప్రెసిడెన్సీ అవెన్యూలో రూ.16 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి ఆవాస్ అపార్ట్‌మెంట్ వాసులు తమ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే గారు వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను తెలియజేసి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

భూపతిరావు నగర్‌లో రూ.16 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు



భూపతిరావు నగర్ కాలనీలో సుమారు రూ.16 లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గారు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే కాలనీవాసులకు డ్రైనేజీ సమస్యల నుంచి ఉపశమనం లభించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడనుంది.

వజ్ర ఎన్‌క్లేవ్‌లో రూ.22 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం వజ్ర ఎన్‌క్లేవ్‌లో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే గారు ప్రారంభించారు. రహదారుల అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వెంకటేశ్వర్ రెడ్డి, అల్వాల్ సర్కిల్ అసిస్టెంట్ ఇంజనీర్ రవళి, జలమండలి సూపర్‌వైజర్ కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అఫ్రోజ్, విఘ్నేష్, మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్ బాబు, శ్రీధర్ గౌడ్, సురేష్, నర్సింగ్ రావు, సతీష్, భాస్కర్, రాజు, ప్రశాంత్, ఆరిఫ్, వీరేశం, రెహమత్ ఖాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కాలనీవాసులు రాజు, పెంటయ్య, దేవేందర్ రెడ్డి, ఠాకూర్ సింగ్, బాలరాజు, శ్రీనివాస్‌తో పాటు పలువురు మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





కొత్తపేటలో అగ్నిప్రమాదం..

# మూడు ఇళ్లకు వ్యాపించిన మంటలు

- **ఒక ఇల్లు పూర్తిగా దగ్ధం, దెబ్బతిన్న రెండు ఇళ్లు**
- **ఫొటో. 27 ఎస్పిటి02ఎ, 02బి కొత్తపేటలో దగ్ధమైన ఇల్లు దృశ్యం.**

**వుదయం న్యూస్ శివ్వంపేట, అక్టోబర్ 28...**

శివ్వంపేట మండలంలోని కొత్తపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు ఇళ్లకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన నింగరబోయిన ప్రవీణ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో షాట్ సర్క్యూట్తో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పక్కనే ఉన్న నింగరబోయిన వెంకటేష్ ఇంటికి వ్యాపించాయి. అనంతరం మరో పక్కనే ఉన్న శివంపేట శేఖర్ ఇంటికి కూడా మంటలు వ్యాపించే క్రమంలో స్థానికులు అప్రమత్తమయ్యారు. మంటలను ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించడంతో పాటు ఫైర్ ఇంజన్ కు సమాచారం అందించారు.

ఈ ప్రమాదంలో ప్రవీణ్ ఇల్లు పూర్తిగా దగ్ధమై ఇంట్లో ఉన్న దాచుకున్న లక్షా50వేల నగదుతో పాటు ఇంటి సామాగ్రి కాలి బూడిదయ్యాయి. వెంకటేష్ ఇంటికి సుమారు 50 శాతం, శేఖర్ ఇంటికి 25 శాతం మేర నష్టం జరిగింది.

బాధితులకు న్యాయం జరిగేవిధంగా అధికారులు చొరవ తీసుకోవాలని సర్పంచ్ లింగరబోయిన రాములు కోరారు.

# డంపింగ్ యార్డు రద్దు చేసే వరకు జేఏసి తో కలసి నడుస్తాం



- **ఇన్మూల్ నర్వ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్లు మిట్టు నాయక్,యాదగిరి.**

**సిద్దాపూర్**

డంపింగ్ యార్డు జీవో 641 రద్దుకోసం జేఏసి ఆధ్వర్యంలో 25 రోజులుగా జరుగుతున్న నిరవధిక రిలే నిరాహార దీక్షలకు ఇన్మూల్ నర్వ గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలి వచ్చి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్మూల్ నర్వ గ్రామ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం సమరశీల పోరాటాలు చేయటానికి సిద్ధంగా ఉన్నామని, జీవో రద్దుఆయ్యేవరకు ఉద్యమానికి మద్దతు గా ఉంటామని తెలిపారు. జేఏసి నాయకుల అడుగుజాడల్లో వాళ్ళు ఇచ్చే కార్యాచరణను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. ప్రజలందరూ కుల మతాలు , పార్టీలకి అతీతంగా జీవో రద్దు కొరకు ఐక్యంగా పోరాడాలి అని కోరారు.ఇన్మూల్ నర్వ మాజీ సర్పంచ్ మిట్టూ నాయక్ మాట్లాడుతూ..ప్రభుత్వం ఇక్కడి అధికారం పార్టీ నాయకులు ఉద్యమాన్ని చీల్చాలని ఎన్ని ప్రయత్నాలు జిమ్మిక్కులు చేసినా ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ముందు అధికార పార్టీ నాయకులు ఈ ఉద్యమంలో పూర్తిగా ఎందుకు పాల్గొన లేక పోతున్నారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ డంపింగ్ యార్డును రానివ్వబోమని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా పోరాటం ఉవ్వెత్తున సాగుతుందని తెలిపారు. జేఏసి తో కలిసి ముందుకు సాగుతామని చెప్పారు.ఈ సందర్భంగా పెంట నోళ్ళ యాదగిరి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు రద్దుకొరకు నిర్విరామంగా పోరాటం చేస్తున్న జేఏసి నాయకులకు ఉద్యమాభివందనాలు తెలిపారు. ఈ పోరాటం విజయవంతం కావాలని, అవసరమైతే మిలిటెంట్ పోరాటాలు చేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డు ను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని, ఇది చావు బతుకుల పోరాటం అని మన జీవించే హక్కును హరించే ఈ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) చైర్మన్ రాంబల్ నాయక్, కో చైర్మన్ లు శ్రీనివాస్ రెడ్డి, బాలయ్య, కో కన్వీనర్ మహేష్, సిద్దాపూర్ గ్రామ జేఏసి అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీధరా చారి, నాయకులు నరేందర్ రెడ్డి, మహేష్ , మరియు ఇన్మూల్ నర్వ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీజేవైఎం జిల్లా కోశాధికారిగా గౌతమ్ గుప్తా

- **పార్టీ బలోపేతానికి కృషి చేస్తా.. యువతను చైతన్యపరుస్తా : గౌతమ్ గుప్తా**

**ఎల్.బి. నగర్, అక్టోబర్ 28 (వుదయం):**



భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి జిల్లా అర్బన్ కోశాధికారిగా మంచికంటి గౌతమ్ గుప్తా బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం అధ్యక్షుడు సాయిరాం గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్ గుప్తా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ యువతను బీజేపీ వైపు ఆకర్షించేందుకు, పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం యువత సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటిపై అవగాహన కల్పిస్తానని పేర్కొన్నారు. యువత సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని గౌతమ్ గుప్తా స్పష్టం చేశారు.

# తాండూరు కందులకు అంతర్జాతీయ గుర్తింపు

**ఆస్ట్రేలియాకు తొలి ఎగుమతి**

**జీఐ ట్యాగ్ పొందిన తాండూరు కందుల ఎగుమతికి అపెడా ఊతం**

**హైదరాబాద్, అక్టోబర్ 28:**

భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన తాండూరు కందులు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ (అపెడా) సహకారంతో ఈ ఎగుమతి సాధ్యమైంది. తొలి సరుకును బుధవారం హైదరాబాద్ నుంచి హైబ్రిడ్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు.

అపెడాలో నమోదైన ఈ సంస్థ తెలంగాణ నుంచి బియ్యం, పప్పుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కిరాణా సరుకులను ఎగుమతి చేస్తోంది. తెలంగాణకే ప్రత్యేకమైన వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రోత్సహించడంలో ఈ ఎగుమతి ఒక ముఖ్యమైన ముందడుగని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ గర్వకారణం తెలంగాణ నుంచి జీఐ గుర్తింపు పొందిన మొట్టమొదటి వ్యవసాయ ఉత్పత్తి తాండూరు కందులే. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల మండలాల్లోని వర్షాధార భూముల్లో ప్రధానంగా ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని సారవంతమైన లోతైన నల్లరేగడి నేలలు, అటాపుల్గైట్ బంకమట్టి ఖనిజ నిక్షేపాలు, విస్తారమైన సున్నపురాయి నిక్షేపాల వల్లే తాండూరు కందులకు ప్రత్యేక లక్షణాలు వచ్చాయి.

### ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం దీపావళి గిఫ్ట్.. డీఏ పెంపు

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. కరవు భత్యాన్ని (డీఏ) మరో 3 శాతం పెంచాలని నిర్ణయించింది. దీంతో ఆ ఉద్యోగుల డీఏ 60 నుంచి 63 శాతానికి డీఏ పెరిగింది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసి పింఛన్ పొందుతున్నవారికి ఇస్తున్న కరవు భృతి (డీఆర్) కూడా 3శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో డీఏ పెంపునకు ఆమోదం లభించింది. ఈ ఏడాది జులై నుంచే వర్తిస్తుందని కేంద్రం తెలిపింది. దీంతో కేంద్రంపై రూ.10,016కోట్ల మేర అదనపు భారం పడనుంది.




# ప్రతిదాన్నీ రాజకీయం చేయడం మానుకోండి...
# రాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్



టాటా గ్రూప్ వ్యవహారంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తప్పుబట్టారు. ప్రతిదాన్నీ రాజకీయం చేయాలని చూడొద్దని హితవు పలికారు. విద్వేషాలను రెచ్చగొట్టే విషయంలో తనతో కలిసి రావాలని వ్యాపారవేత్తలను ఉసిగొల్పేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారని, ఏ వ్యాపారీ మాట్లాడే ధైర్యం కూడా చేయలేకపోతున్నారంటూ రాహుల్ గాంధీ విమర్శలపై నిర్మలా సీతారామన్ ఎక్స్ వేదికగా స్పందించారు. పరిశ్రమలను, పారిశ్రామికవేత్తల విజయాలను రాహుల్ గాంధీ పదేపదే తక్కువ చేసి చూస్తున్నారని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం పరిశ్రమలను ఉద్యోగ సృష్టికర్తగా, ఆర్థిక వృద్ధి చోదకంగా పరిగణిస్తుందని అన్నారు. వ్యాపారాలను, పెట్టుబడులను ప్రోత్సహించడం, పరిశ్రమకు మద్దతు ఇవ్వడం తమ విధానమని పేర్కొన్నారు. "ప్రతిపక్ష నేతగా మీరు ప్రతి అంశాన్ని రాజకీయం చేయొద్దు. వాణిజ్య, న్యాయపరమైన అంశాలను నేరపూరితమైనవిగా ముద్ర వేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారత పరిశ్రమ, మన పారిశ్రామికవేత్తల విజయాలను పదేపదే విమర్శించారు. ఇప్పుడు, అపనమ్మకాన్ని, విద్వేషాన్ని వ్యాప్తి చేయడంలో కలిసి రావాలని వ్యాపారవేత్తలను రెచ్చగొడుతున్నారా? లైసెన్స్ – కోటా రాజ్ పేరుతో దశాబ్దాల పాటు మీ పార్టీ పారిశ్రామిక వేత్తల స్ఫూర్తిని అణచివేసింది. కోట్లాది మంది భారతీయులపై పేదరికాన్ని రుద్దింది'' అని నిర్మలా సీతారామన్ విమర్శించారు. "మీ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేయడం మానుకోవాలి. నిర్మాణాత్మకంగా వ్యవహరించండి. భారత రాజ్యాంగం తన పౌరులందరికీ న్యాయం జరిగేలా చూస్తుంది. దాన్ని పరిరక్షించే బాధ్యత మన గౌరవనీయ న్యాయస్థానాలకు అప్పగించింది. మీరు, మీ పార్టీ, మీ పార్టీకి చెందిన ప్రధానులు న్యాయవ్యవస్థను ఎంత నీచంగా కించపరిచారో అనడానికి చరిత్రే సాక్ష్యం. కాబట్టి ప్రతిచోటా దెయ్యాలను చూడడం మానుకోండి'' అని గట్టిగా చెప్పారు.

# 'ఐదు అవుతోంది'.. ఈ మాట ఇండియన్స్ ఎవరూ చెప్పరు..!



నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇండియా–నెదర్లాండ్స్ బిజినెస్ ఫోరంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత కార్మిక శక్తి గురించి మాట్లాడుతూ.. భారతీయులు ఎప్పుడూ కష్టపడి పనిచేయడానికి ఆసక్తి చూపుతారని తెలిపారు. 'భారత్‌లో ఉద్యోగులు కేవలం కష్టపడి పని చేయాలని మాత్రమే అనుకుంటారు. అంతే కానీ ఎవరూ ఐదు గంటల సమయం అయ్యిందని (ఆఫీస్ ముగింపు సమయాన్ని ఉద్దేశించి) చెప్పరు. అలాగే వారాంతాలను కూడా గుర్తు చేయరు. దీని వల్ల భారత్‌లో పెట్టుబడులు పెడితే వ్యాపారాలు ఊహించని స్థాయిలో వృద్ధి చెందుతాయి' అని పేర్కొన్నారు. ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాల గురించి కూడా మాట్లాడారు. అనంతరం నెదర్లాండ్స్‌లోని ప్రముఖ వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని వారిని కోరారు. ఈ ఏడాది మేలో ప్రధాని మోదీ నెదర్లాండ్స్ పర్యటన సమయంలో ఇరుదేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఈ క్రమంలోనే కొత్త వాణిజ్య, పెట్టుబడి అవకాశాలను సృష్టించేందుకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (FTA) వినియోగించుకునే లక్ష్యంతో గోయల్ అక్కడి ప్రభుత్వంతో సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, స్వచ్ఛ ఇంధనం, కీలక ఖనిజాలు, అధునాతన తయారీ రంగాలపై చర్చలు జరిపినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.

# మూడేళ్లు దాటినా వాడని ఖాతాలు మూత: పీఎన్‌బీ




ప్రభుత్వరంగ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB) ఖాతాదారులకు అలర్ట్. మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఖాతాలను మూసివేయనున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. సెప్టెంబర్ 30 నాటికి గడిచిన మూడేళ్లలో ఎలాంటి లావాదేవీలు చేయని, నగదులేని ఖాతాలను మూసివేయనున్నట్లు పీఎన్‌బీ పబ్లిక్ నోటీసులో పేర్కొంది. ఈ తరహా ఖాతాలు దుర్వినియోగం కాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ తరహా ఖాతాలు రీయాక్టివేట్ చేయాలనుకుంటే నవంబర్ 10లోగా నో యువర్ కస్టమర్ (KYC)ని పూర్తి చేయాలని బ్యాంక్ సూచించింది. నిర్దేశిత గడువులోగా కేవైసీ పూర్తి చేయకుంటే ఆ ఖాతాలను శాశ్వతంగా మూసివేస్తామని బ్యాంక్ తెలిపింది. కాబట్టి మూడేళ్లుగా లావాదేవీలు చేయని ఖాతాదారులు సమీపంలోని పీఎన్‌బీ బ్రాంచ్‌కు వెళ్లి కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని బ్యాంక్ సూచించింది.

ఏవైనా సందేహాలుంటే 1800–1800, 1800–2021 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఓ ప్రకటనలో సూచించింది.

# హైదరాబాద్‌లో 'ఎమ్‌జీ విండ్సర్ ఇండల్జ్ ఎడిషన్' గ్రాండ్ లాంచ్



భారతదేశ ఎలక్ట్రిక్ వాహన రంగంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఎమ్‌జీ విండ్సర్‌లో సరికొత్త మోడల్ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ వాహన తయారీ సంస్థ 'జె ఎస్ డబ్ల్యూ ఎం జి' మోటర్ ఇండియా' మార్కెట్లోకి మరింత విలాసవంతమైన ఎం జి విండ్సర్ ఇండల్జ్ ఎడిషన్'ను బుధవారం నగరంలో ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని షోరూమ్‌లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక ఆవిష్కరణ వేడుకలో జేఎస్‌డబ్ల్యూ ఎమ్‌జీ మోటార్ ఇండియా రామ్ ఎమ్‌జీ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సరికొత్త లగ్జరీ మోడల్‌ను రామ్ ఎమ్‌జీ సి ఈ ఓ గున్‌జీత్ సింగ్, జేఎస్‌డబ్ల్యూ ఎమ్‌జీ మోటర్ ఇండియా నేషనల్ సేల్స్ హెడ్ సౌరవ్ ప్రకాష్ సంయుక్తంగా మార్కెట్లోకి విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో రామ్ ఎమ్‌జీ సేల్స్ వైస్ ప్రెసిడెంట్లు అనుపమ్ బాజ్‌పాయ్, దీపక్ దేవరపల్లి లతో పాటు జేఎస్‌డబ్ల్యూ ఎమ్‌జీ మోటర్ ఇండియా సౌత్ జోనల్ సేల్స్ హెడ్ అమిత్ మాగ్గన్ తదితరులు పాల్గొని వాహనాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, వినియోగదారుల మారుతున్న అభిరుచులకు అనుగుణంగా విండ్సర్‌ను మరింత ప్రీమియం లైఫ్‌స్టైల్ వాహనంగా మార్చాలనే లక్ష్యంతోనే ఈ ఇండల్జ్ ఎడిషన్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ కారు ఎక్స్–షోరూమ్ ప్రారంభ ధరను రూ. 17,99,800 గా నిర్ణయించినట్లు వెల్లడించారు. సరికొత్త బిజినెస్ క్లాస్ కంఫర్ట్, ఆకట్టుకునే ఫ్యూచరిస్టిక్ డిజైన్, అధునాతన ఇంటెలిజెంట్ ఫీచర్లతో ప్రయాణికులకు సరికొత్త లగ్జరీ అనుభూతిని అందించేలా ఈ మోడల్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. కేవలం 24 నెలల స్వల్ప వ్యవధిలోనే 80,000 కంటే ఎక్కువ కుటుంబాలు ఎమ్‌జీ వాహనాన్ని ఎంచుకోవడం విశేషమని, రాబోయే పండుగ సీజన్ లో ఈ ఇండల్జ్ ఎడిషన్ మరిన్ని మైలురాళ్లను అందుకుంటుందని ఈ సందర్భంగా అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.




## భారత్ ఘనవిజయం.. జింబాబ్వేతో సిరీస్ క్లీన్‌స్వీప్



జింబాబ్వేతో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 3 – 0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన మూడో వన్డేలో టీమ్‌ఇండియా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 132 పరుగుల లక్ష్యాన్ని కేవలం 17 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ప్రతీకా రావల్ (59★), షఫాలీ వర్మ (51★) హాఫ్ సెంచరీలతో రాణించారు. హర్లీన్ డియోల్ 19 పరుగులు చేయగా.. యాస్తికా భాటియా డకౌట్ అయింది. జింబాబ్వే బౌలర్లలో సిబంద, లోరిన్ చెరో వికెట్ తీశారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే భారత బౌలర్ల ధాటికి 39.5 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ మోడెస్టర్ ముపాచిక్వా (37) టాప్ స్కోరర్. కెప్టెన్ జోసెఫిన్ ఎన్కోమో (35) పరుగులు చేసింది. చిడ్జా ధురురు (20), న్యాషా గ్వాంజురా (10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో స్పిన్నర్ వైష్ణవి శర్మ (5/39) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకుంది. క్రాంతి గౌడ్, సయాలి సత్ఘరే చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

# బంగారు పతకాల విజేత..
# పారా అథ్లెట్ నీరజ్ ఆత్మహత్య




శారీరకంగా వైకల్యం ఉన్నా.. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటిన పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ కఠిన నిర్ణయం తీసుకున్నాడు. అర్ధాంతరంగా తనువు చాలించి క్రీడాభిమానులను షాక్‌కు గురి చేశాడు. పారా ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత నీరజ్ యాదవ్ (42) ఆత్మహత్య చేసుకున్నాడు. తన స్వగృహంలో విషం తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. నీరజ్ మృతిని భారత పారా అథ్లెటిక్స్ జట్టు కోచ్ సత్యనారాయణ నిర్ధరించారు.

నీరజ్ యాదవ్ జావెలిన్ త్రో ఎఫ్55 కేటగిరీలో పోటీపడేవాడు. 2018 పారా ఆసియా క్రీడల్లో బంగారు పతకం, 2023లో జావెలిన్‌తోపాటు డిస్కస్ త్రో విభాగాల్లో స్వర్ణాలను నెగ్గాడు. అయితే, డోపింగ్ టెస్టులో విఫలం కావడంతో ఈసారి పారా ఆసియా క్రీడల్లో పోటీపడలేకపోయాడు. అప్పట్నుంచి మానసికంగా ఒత్తిడికి గురయ్యాడు. ఏడేళ్ల వయసులో పోస్ట్ పోలియో రెసిడ్యుయల్ పెరాలిసిస్ కారణంగా అతడు వీల్‌ఛైర్‌కే పరిమితమయ్యాడు. తొలుత వీల్‌ఛైర్ టెన్నిస్ ఆడిన అతడు.. పారా అథ్లెటిక్స్‌కు మారాడు. అంతర్జాతీయ వేదికపై అద్భుతాలు సృష్టించాడు. జావెలిన్, డిస్కస్‌త్రోపాటు షాట్‌పుట్‌లోనూ పోటీపడ్డాడు.

నీరజ్ మరణానికి పారా ఆసియా క్రీడల్లో బరిలోకి దిగకపోవడమే కారణమని చెప్పలేమని కోచ్ సత్యనారాయణ స్పష్టం చేశారు. "నీరజ్ మరణ వార్త తీవ్రంగా బాధించింది. అతడు ఎందుకీ నిర్ణయం తీసుకున్నాడో తెలియదు. క్రీడాకారుల జీవితాల్లో ఒడుదొడుకులు సర్వసాధారణం. నీరజ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరం'' అని సత్యనారాయణ పేర్కొన్నారు.

# సంజు భాయ్ త్యాగం నిస్వార్థమైంది: అభిషేక్ - వైభవ్ స్పెషల్ చిట్‌చాట్




న్యూజిలాండ్ పర్యటనను టీమ్‌ఇండియా టీ20 సిరీస్ విజయంతో శుభారంభం చేసింది. ఐదు టీ20ల సిరీస్‌లో 3–0 ఆధిక్యం సాధించిన భారత్.. మరో రెండు మ్యాచులు మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది. ఇక మూడో టీ20లో భారత ఆటగాళ్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ చెలరేగిపోయారు. రికార్డులు సృష్టించి టీమ్‌ఇండియాకు ఘన విజయం అందించారు. మ్యాచ్ అనంతరం ప్రత్యేక చిట్‌చాట్ నిర్వహించారు.

అభిషేక్: మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి జరిగిన ప్రాక్టీస్ సమయంలో వైభవ్ ఓ మాట చెప్పాడు. భాగ్ మిల్కా భాగ్ సినిమాలోని 'ముందుకు కొట్టనా.. వెనక్కి కొట్టనా?' అనే డైలాగ్ తరహాలో మ్యాచ్‌లో వైభవ్ ఆడాడు. వైభవ్: అభిషేక్ భాయ్ ఆటతీరు గురించి ఎవరూ ఏమీ అనలేరు. అతడు ఎలా ఆడతాడో మనందరికీ తెలుసు. అభిషేక్: ఈ మ్యాచ్‌లో మేమిద్దరం ఓపెనింగ్ చేశాం. ఈ సందర్భంగా మరొక విషయం చెప్పాలి. సంజు భాయ్ ఓపెనర్‌గా వచ్చేవాడు. కానీ, ఈసారి అతడు వన్‌డౌన్‌కు మారాడు. జట్టులోని ప్రతి ఒక్కరూ నిస్వార్థంగా ఉంటారనడానికి ఇదే తార్కాణం. టీమ్‌లో అలాంటి చక్కటి వాతావరణం ఉంది. వైభవ్.. ఈసారి తొలి బంతిని ఎదుర్కొనేటప్పుడు ఏమనుకున్నావు? వైభవ్: నేను గత మ్యాచ్‌లో చాలా ఎక్కువ సమయం తీసుకున్నాననిపించింది. నా టీ20 గేమ్‌కు తగ్గట్టుగా కాకుండా.. నెమ్మదిగా ఆడేందుకు ప్రయత్నించా. కానీ, ఈసారి మాత్రం నాకు మంచి ఛాన్స్ దక్కింది. తొలి బంతి నుంచే పరుగుల వేట మొదలుపెట్టా. అభిషేక్: నేను కూడా అదే అనుకున్నా. ఆరంభ ఓవర్లలో భారీగా పరుగులు రాబట్టేందుకు వైభవ్ ఆటతీరు సెట్ అవుతుంది. అతడు ఫస్ట్ బాల్‌ను ఎదుర్కొనేటప్పుడు ఎలాంటి షాట్ ఆడతాడనేది నాన్‌స్ట్రైకర్‌లోని బ్యాటర్‌కూ కాస్త ఆసక్తి అనిపిస్తుంది. ఈ మ్యాచ్‌లో వైభవ్ అద్భుతంగా ఆడాడు. కీలక పాత్ర పోషించాడు. నా ఇన్నింగ్స్ వెనుక క్రెడిట్ అతడికే ఇస్తా. వైభవ్: అభిషేక్ మంచి ఆరంభం ఇచ్చినప్పుడు వెనకడుగు వేయకూడదు. లేకపోతే మ్యాచ్ మన చేతుల్లో నుంచి వెళ్లిపోతుంది. నేనూ అదే చేశా. మా ఊర్లో మేం ఇలానే ఆడుకునేవాళ్లం.

## వైభవ్‌కు 'ఓపెనింగ్' చాక్లెట్‌లాంటిది.. మూల్యం మాత్రం కివీస్‌దే: మాజీ క్రికెటర్



తనకు అచ్చొచ్చే ఓపెనింగ్ స్థానంలో వైభవ్ సూర్యవంశీ అదరగొట్టాడు. అంతకుముందు కివీస్‌తో రెండో టీ20లో వన్‌డౌన్‌లో వచ్చిన అతడు.. కేవలం 4 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. షాట్లు కొట్టేందుకు ఇబ్బంది పడి ఔటయ్యాడు. ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన మూడో టీ20లో మాత్రం చెలరేగిపోయాడు. అభిషేక్ శర్మతో కలిసి రికార్డులు సృష్టించాడు. ఈ క్రమంలో వైభవ్ ఇన్నింగ్స్‌పై భారత మాజీ క్రికెటర్ శఠగోపన్ రమేశ్ సరదా వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌కు టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ 'చాక్లెట్' లాంటి ఓపెనింగ్ ప్లేస్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిందని.. దానికి మూల్యం కివీస్ చెల్లించుకుందని వ్యాఖ్యానించాడు. "వైభవ్ కు ఓపెనింగ్ అనే చాక్లెట్‌ను మేనేజ్‌మెంట్ ఇచ్చింది. తర్వాత రెండు రోజులు సెలవు (నాలుగో టీ20 అక్టోబర్ 30న) అని తెలిసి ఈ పిల్లాడు చాలా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. మనసు ప్రశాంతంగా ఉంటే ఎలా ఉంటుందో చేసి చూపించాడు. మరో ఎండ్‌లో అభిషేక్ శర్మ ప్రత్యర్థి బౌలర్లను భయభ్రాంతులకు గురి చేశాడు. అతడి పేరు వింటేనే వణుకు వచ్చేలా చేశాడు. పరుగుల రాక్షసుడిగా ఆడాడు. దాదాపు అన్ని రికార్డులూ బద్దలు కొట్టాడనుకుంటా. వైభవ్‌తో కలిసి తొలి వికెట్‌కు ఏడు ఓవర్లలోనే 133 పరుగులు అంటే 19 రన్‌రేట్ కొనసాగించడం మామూలు విషయం కాదు. దీపావళిని వీరిద్దరూ ముందే తీసుకొచ్చారు'' అని రమేశ్ వెల్లడించాడు. కివీస్‌తో వెలింగ్టన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 199 పరుగుల లక్ష్యాన్ని 13.2 ఓవర్లలోనే పూర్తి చేసిన సంగతి తెలిసిందే. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అభిషేక్ శర్మ (113: 38 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లు), వైభవ్ సూర్యవంశీ (45: 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అదరగొట్టారు.

## జహీర్ నిర్ణయంతోనే బ్యాటింగ్ కోచ్‌ను నియమించలేదు: సీఎస్‌కే సీఈవో

వచ్చే ఐపీఎల్ (IPL 2027) సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ తన బలగాన్ని సిద్ధం చేసుకుంటోంది. గత మూడు సీజన్లలో ఒక్కసారి కూడా కనీసం ప్లేఆఫ్స్‌కు చేరుకోలేదు. ఐపీఎల్ 2027 ఎడిషన్ కోసం ప్రధాన కోచ్‌తోపాటు ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లు, ఒక బౌలింగ్ కోచ్‌ను నియమించింది. ఇక మిగిలింది ఏకైక కోచ్ పదవి బ్యాటింగ్‌కు సంబంధించి మాత్రమే. ఇప్పటి వరకు ఆ ప్లేస్‌లో ఉన్న మైక్ హస్సీ రెండు రోజుల కిందటే జట్టును వీడాడు. మరి ఈ పదవికి దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కానీ, సీఎస్‌కే (CSK) మాత్రం బ్యాటింగ్ కోచ్ లేకుండా సిద్ధమవుతోంది. 'మా కోచింగ్ స్టాఫ్ నియామకం పూర్తైంది. నిన్న మేం ప్రకటించినవారంతా మా బ్యాక్ రూమ్ టీమ్. మాకు బ్యాటింగ్ కోచ్ లేదు. బ్యాటింగ్ కోచ్‌ను పెట్టుకోకూడదనేది మా ప్రధాన కోచ్ జహీర్ ఖాన్ తీసుకున్న నిర్ణయం. మాకు అందుకు తగిన ఆప్షన్లు ఉన్నాయి. అసిస్టెంట్ కోచ్ బ్యాటీనే బ్యాటింగ్ మెంటార్‌గా వాడుకొనేందుకు అవకాశం ఉంది. ఆ దిశగా చర్చిస్తున్నాం'' అని కాశీ విశ్వనాథ్ తెలిపారు. గత కొన్ని రోజులుగా నెట్టింట ఒకటే చర్చ. సీఎస్‌కేకు హార్దిక్ పాండ్య వచ్చేస్తాడని.. అతడికే కెప్టెన్సీ అప్పగిస్తారని డిస్కషన్ సాగుతోంది.



# వుదయం సినిమా

MOVIE TIME!

## 'రుద్రవనం పీఎస్' ప్రీ రిలీజ్ ఈవెంట్

**వుదయం సినిమా:** ఎల్లో ఫ్లవర్స్, శ్రీ చక్ర మూవీస్ బ్యానర్ల మీద రమేష్ పుప్పాల, సూర్యకాంతి నిర్మాతలుగా శశిధర్ మున్నంగి తెరకెక్కించిన న్యూ సిరీస్ 'రుద్రవనం పీఎస్'. ఈ సిరీస్‌ను జీ5లో అక్టోబర్ 30 నుంచి స్ట్రీమింగ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో.. హరీష్ శంకర్ మాట్లాడుతూ .. ''మా నిర్మాత రమేష్ పుప్పాల గారిని మళ్లీ ఇలా చూడటం ఆనందంగా ఉంది. 'మిరపకాయ్' టైంలో రమేష్ గారు నన్నెంతో ఎంకరేజ్ చేశారు. రాజా రవీంద్ర సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. వివేక్ కూచిభోట్ల గారు నా ఫ్యామిలీ మెంబర్‌లాంటి వారు. వివేక్ గారి శ్రీమతి సూర్యకాంతి గారు ఈ సిరీస్‌తో నిర్మాతగా రానున్నారు. డైరెక్టర్ శశి గారు ఈ సిరీస్‌తో గొప్ప విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. 'రుద్రవనం పీఎస్' కంటెంట్ నేను చూశాను. ఊహించిన దాని కంటే పెద్ద విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.నరేష్ అగస్త్య మాట్లాడుతూ .. ''పన్నెండేళ్ల క్రితం జీ5లో 'పసుపు కుంకుమ'తో నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాత 'పరువు', 'వికటకవి' చేశాను. ఇప్పుడు 'రుద్రవనం పీఎస్' అంటూ రాబోతున్నాం. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన జీ5 టీంకు థాంక్స్. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన సూర్యకాంతి గారికి, రమేష్ గారికి థాంక్స్. శశితో నేను ఎన్నో కథల్ని చర్చించాను. అతని వద్ద ఇంకా చాలా గొప్ప గొప్ప కథలున్నాయి. శశి, అష్కర్ ఎన్నో నిద్రలేని రాత్రుల్ని గడిపారు. ఈ సిరీస్‌లో ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించారు. అక్టోబర్ 30 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కాబోతోంది. అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు.దర్శకుడు శశిధర్ మున్నంగి మాట్లాడుతూ .. ''రుద్రవనం పీఎస్' క్రైమ్, థ్రిల్లర్‌గా రాబోతోంది. ప్రతీ ఎపిసోడ్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. తెలుగులో గొప్ప క్రైమ్, థ్రిల్లర్‌గా నిలుస్తుంది. ఈ ప్రయాణంలో సపోర్ట్ చేసిన జీ5 టీంకి, నా నిర్మాతలు, నా ఆర్టిస్టులకు థాంక్స్. జీ5లో అక్టోబర్ 30 నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.నిర్మాత రమేష్ మాట్లాడుతూ .. ''రుద్రవనం పీఎస్' సిరీస్‌ను మా దర్శకుడు శశి గారు అద్భుతంగా తెరకెక్కించారు.




## 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం. 47' ప్రీ రిలీజ్

**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం. 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి కథానాయిక. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో నారా రోహిత్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 20 ఏళ్ల తర్వాత వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'ఆదర్శ కుటుంబం' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దీపావళి వెలుగులను కాస్త ముందుగానే తీసుకొస్తూ అక్టోబర్ 30న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లోని శిల్పకళావేదికలో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. "20 ఏళ్ల తర్వాత నాది, త్రివిక్రమ్ కలయికలో సినిమా వస్తుంది. ఎలాంటి సినిమా చేయాలనే ఒత్తిడి ఉండటం సహజం. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి లాంటి సినిమాలు చేసిన తరువాత కథ ఎంచుకోవడం అనేది చాలా కష్టంగా ఉంటుంది. కానీ, త్రివిక్రమ్ ఇలాంటి అద్భుతమైన స్క్రిప్ట్ తో వచ్చారు. అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. కామెడీ మాత్రమే కాకుండా థ్రిల్, సస్పెన్స్ ఇలా అన్ని ఎమోషన్స్ తో ఇలాంటి అద్భుతమైన కథ చెప్పినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. అక్టోబర్ 30న ఆదర్శ కుటుంబం విడుదల కాబోతుంది. మీకు తప్పకుండా నచ్చుతుంది. నేను ఫ్యామిలీ సినిమాలు చాలా చేశాను. కానీ, ఈ సినిమా చాలా ప్రత్యేకమైనది. ఏం జరిగినా నేను నా ఫ్యామిలీని కాపాడుకోవాలి. ఈ ఫ్యామిలీని నేను కాపాడుకుంటాను, వాళ్ళతోనే ఉంటాను.. అదే ఆదర్శ కుటుంబం. అభిమానుల ప్రేమ ఉంటే చాలు నాకు. మొదటి నుంచి నాకు ఆ ప్రేమను ఇస్తూనే ఉన్నారు. మన ఇండియన్ క్రికెటర్లు ఎలా సిక్సర్లు కొడుతున్నారో.. ఈ సినిమాతో స్టేడియం బయట మేము అలా సిక్సర్లు కొడతాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ థాంక్స్. ఇంత మంచి సినిమాని ఇచ్చిన దర్శకుడు త్రివిక్రమ్ కి, నిర్మాతలు చినబాబు గారికి, నాగవంశీకి ప్రత్యేక కృతజ్ఞతలు." అన్నారు.మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. ఎంత గొప్ప ఫోటో అయినా లేదా పెయింటింగ్ అయినా అది తగిలించడానికి ఒక గోడ కావాలి. ఈ సినిమా ఇంత గొప్పగా తీర్చిదిద్దబడటానికి తమన్ తన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో ఒక గోడలాగా నిలబడ్డాడు. ఇవాళ పొద్దున్నే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కంప్లీట్ చేశాం. నా గ్రాటిట్యూడ్ ని ఎలా ఎక్స్‌ప్రెస్ చేయాలో తెలియక.. తమన్ మాట్లాడున్న సమయంలో వచ్చి వెనక నిల్చున్నాను. నాకు అతనిలాగా సంగీతంతో మాట్లాడటం రాదు. కాబట్టి నా స్పర్శతోనే అతనితో మాట్లాడే ప్రయత్నం చేసి, అతని భుజం మీద చెయ్యేశాను. రచయితగా నా ప్రయాణాన్ని వెంకటేష్ గారి పవిత్ర బంధం సినిమాతోనే మొదలుపెట్టాను. ఓ రకంగా ఆయన నాతో ఓనమాలు దిద్దించారు. పెళ్ళి చేసుకుందాం సినిమా సమయంలో నేను ఎవరో తెలియకపోయినా నన్ను ఎంకరేజ్ చేశారు. నేను 'నువ్వు నాకు నచ్చావ్' కథ చెప్పినప్పుడు, అసలు నా మీద ఏ నమ్మకం ఉందో తెలియదు.. నేను కథ చెప్పడం పూర్తయిన వెంటనే ఈ సినిమా మనం చేస్తున్నాం, ఎవరేం చెప్పినా పట్టించుకోవద్దని రవికిశోర్ గారికి, విజయభాస్కర్ గారికి షేక్ హ్యాండ్ ఇచ్చారు. అప్పటినుంచి నా కెరీర్ వేరే టర్న్ తీసుకుంది. అందుకే నేను వెంకటేష్ గారికి ఎప్పుడు కృతజ్ఞుడినై ఉంటాను. అదే సపోర్ట్ ఇప్పటికీ ఉంది.




## "కిల్లర్" ప్రెస్ మీట్

**వుదయం సినిమా:** జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సెన్సేషనల్ సైఫై థ్రిల్లర్ మూవీ "కిల్లర్". ఈ చిత్రంలో మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, అయినాబత్తిన దశరథ మాధవ్, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. "కిల్లర్" సినిమా ఈ నెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. ఓవర్సీస్ లో "కిల్లర్" మూవీని ఓఎంజి పిక్చర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ రోజు ఈ సినిమా కోటి రూపాయల కాంటెస్ట్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోలైన్ ప్రొడ్యూసర్ సీతారామ్ మాట్లాడుతూ – నేను ఈ సినిమాకు లైన్ ప్రొడ్యూసర్‌గా వర్క్ చేయడంతో పాటు ఒక క్యారెక్టర్ లో నటించాను. నా పాత్ర ఈ కథలో ఎంత కీలకంగా ఉంటుంది అనేది తెరపై చూడాలి. మా సినిమా కోసం టీమ్ అంతా హార్డ్ వర్క్ చేశారు. వారి కష్టాన్ని మీరు మూవీలో చూడబోతున్నారు. అన్నారు.నటి మానస మాట్లాడుతూ – నేను ఈ చిత్రంలో నటించినా కథలోని ట్విస్ట్ ఏంటో మాకూ తెలియదు. ఆ ట్విస్ట్ ఏంటి అనేది ఈ నెల 30న థియేటర్స్ లో చూసి మీరే తెలుసుకోవాలి. మా డైరెక్టర్ గారి కాన్ఫిడెన్స్ చూసి మాలోనూ సినిమా సక్సెస్ మీద నమ్మకం పెరుగుతోంది. మా సినిమాను ప్రేక్షకులంతా ఆదరించాలని కోరుకుంటున్నా. అన్నారు.నటుడు చంద్రకాంత్ మాట్లాడుతూ – మా డైరెక్టర్ సుకు సూపర్బ్ స్పీచ్ ఇచ్చారు. మా చిత్రంలో నాతో పాటు ప్రతి ఒక్కరి క్యారెక్టర్ మిమ్మల్ని సర్ ప్రైజ్ చేస్తుంది. ఎన్నో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ మా మూవీలో ఉన్నాయి. మీకు సూపర్ పవర్స్ వస్తే ఏం చేస్తారని మహిళల కోసం ఒక కాంటెస్ట్ పెట్టాం.



## నవంబర్ 6న "సమ్మర్ హాలిడేస్"

**వుదయం సినిమా:** కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవంబర్ 6న "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు కింగ్ ఆఫ్ ఎంటర్ టైన్ మెంట్ హీరో శ్రీవిష్ణు అతిథిగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోరైటర్ కొండల్ రావు మాట్లాడుతూ – కింగ్ ఆఫ్ ఎంటర్ టైన్ మెంట్ శ్రీ విష్ణు మా సినిమా ట్రైలర్ లాంఛ్ చేయడం హ్యాపీగా ఉంది. మా సినిమాను చిన్న పిల్లల సినిమా అంటున్నారు. నోస్టాల్జిక్ మూవీ అంటున్నారు. నేను మాత్రం ఇది ప్యూర్ ఎమోషన్స్ చూపించే సినిమా అని చెప్పగలను. అన్నారు.నటి వాసుకి మాట్లాడుతూ – ఈ సినిమాలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా. నేను బాగా ఇష్టపడిన స్క్రిప్ట్ ఇది. ఇలాంటి పిల్లల సినిమాలు చూసే అవకాశం మనకు తరుచూ రాదు. ఈ సినిమాలో స్వచ్ఛమైన ఎమోషన్స్ చూస్తాం. ఈ కథను అంతే ప్యూర్ గా డైరెక్టర్ శ్రీకర్ తెరకెక్కించారు. ప్రస్తుత ట్రెండ్ లో ఇలాంటి సినిమాలు నేను చూడలేదు. పిల్లలతో పాటు పెద్దలు కూడా ఈ సినిమాను ఎంజాయ్ చేయొచ్చు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు.



## 'హుషారు 2' టీజర్ లాంచ్



**వుదయం సినిమా:** హెచ్‌కే ఫిల్మ్స్, కలియుగ వారధ క్రియేషన్స్ బ్యానర్ల మీద రాహుల్ వర్మ, కె. వీణా రాణి, కె. హనుమంత్ రాజు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'హుషారు 2'. ఈ మూవీకి శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి ఆంటోనీ, దినేష్ తేజ్, శశిధర్, రాజై రోవన్, అభిజ్ఞ, శ్రీకాంత్ కన్ని, బాబీ రాచకొండ ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీ టీజర్‌ని మంగళవారం నాడు రిలీజ్ చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కి పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ .. 'హర్ష గారు 'హుషారు 2'లో నాకు గొప్ప పాత్రను ఇచ్చారు. చాలా ఏళ్ల తర్వాత మంచి పాత్రను పోషించాను. 'హుషారు'లో ఎంత నవ్వించారో.. అంతకు మించి నవ్విస్తూనే, ఆలోచించేలా చేస్తారు. నిరుద్యోగ్య సమస్యను ఎంతో గొప్పగా చూపించారు. పని హక్కుని కోల్పోతోన్నాం. శ్రమకు తగ్గ ప్రతిఫలం అనేది లేదు. నలిగిపోతోన్న యువతకి స్వతంత్రంగా, స్వేచ్ఛగా, ఆత్మాభిమానంతో బతకాలనే గొప్ప సందేశాన్ని ఇచ్చారు. ఇలాంటి గొప్ప చిత్రాన్ని ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తున్నాను. 'హుషారు 2' సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది. దర్శకుడు హర్ష ఎక్కడా కూడా రాజీ పడడు. రవిరాజా పినిశెట్టి తర్వాత నాకు హర్షలో ఆ క్వాలిటీ కనిపించింది. కెమెరామెన్ ఎంతో ఓర్పుగా ఉన్నాడు. సినిమా నచ్చితే ప్రజలు ఎవరినైనా సరే స్టార్‌లను చేస్తారు. అలా ఈ మూవీని జనాలకు నచ్చేలా హర్ష తీశారు. 'హుషారు 2' మూవీని జనాల వద్దకు తీసుకు వెళ్లాలని మీడియాకి విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు.అశోక్ గల్లా మాట్లాడుతూ .. ''హుషారు 2' టీజర్ చూస్తే సినిమా ఎలా ఉండబోతోందో స్పష్టంగా అర్థం అవుతుంది. ఇందులో మా నలుగురి పాత్రలు ఎంతో వినోదాత్మకంగా ఉంటాయి.

## 'పవర్‌పేట' నుంచి రితికా నాయక్ ఫస్ట్ లుక్

**వుదయం సినిమా:** సందీప్ కిషన్ హీరోగా, కృష్ణ చైతన్య రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పవర్‌పేట'. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని సక్సెస్‌ఫుల్ నిర్మాణ సంస్థ 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇంటెన్స్ క్యారెక్టర్లు, డ్రామాతో కూడిన పవర్‌ఫుల్ కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. ఇప్పటికే మేకర్స్ సందీప్ కిషన్‌ను సేనాపతి రవిగా పరిచయం చేస్తూ పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ప్రేమ, గౌరవం, రాజకీయాల కలయికగా ఈ కథ ఉండబోతోందనే ఆసక్తిని ఆ గ్లింప్స్ కలిగించింది.వరుస బ్లాక్‌బస్టర్స్ 'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రితికా నాయక్.. 'పవర్‌పేట'లో సందీప్ కిషన్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. రితికా నాయక్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె పాత్రను పడమటవీధి జానకిగా పరిచయం చేశారు. సంప్రదాయబద్ధమైన, అందమైన లుక్‌లో కనిపిస్తున్న రితికా నాయక్.. పాతకాలపు ఇంట్లో చెక్క బెంచీపై హుందాగా కూర్చుని ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ సారీ, పీచ్ కలర్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సంప్రదాయ ఆభరణాలు, ఉంగరాల జుట్టు ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ప్రశాంతమైన హావభావాలతో పడమటవీధి జానకిగా రితికా ఆకట్టుకుంటున్నారు.మేకర్స్ రితికా నాయక్ గ్రేస్, చార్మ్‌తో పాటు ఆమె ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌ను చూపిస్తూ ఆసక్తికరమైన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో రితికా వివిధ లుక్స్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఓవర్‌సైజ్డ్ షర్ట్‌లో ఆమె లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత్రలోని విభిన్న కోణాలను పరిచయం చేసిన ఈ గ్లింప్స్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.దర్శకుడు కృష్ణ చైతన్య తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌గా 'పవర్‌పేట'ను రూపొందిస్తున్నారు.



## పుట్టినరోజు వేళా హీరో, దర్శకుడు షిరాజ్ మెహదీ ఆవేదన




**వుదయం సినిమా:** పుట్టినరోజు వేడుకల వేళ ఆనందంగా ఉండాల్సిన హీరో, దర్శకుడు షిరాజ్ మెహదీ.. తన సినిమా విడుదలకు ఎదురవుతున్న అడ్డంకులను ప్రస్తావిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంతో కష్టపడి రూపొందించిన 'ఓ అందాల రాక్షసి' చిత్రానికి థియేటర్లు కేటాయించడం లేదని, చిన్న సినిమాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని 'అఆ సినీ స్టూడియోస్'లో మీడియా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలు, ప్రెస్‌మీట్‌లో తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న సినిమాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు.టాలీవుడ్‌లో రెడ్ అలర్ట్!ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న సినిమాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని షిరాజ్ మెహదీ అన్నారు. నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతో శ్రమించి సినిమాలు రూపొందిస్తున్నా.. వాటిని ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు సరైన అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు. వంద సినిమాలు విడుదలైతే రెండు, మూడు చిత్రాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందని, మిగిలిన సినిమాలు థియేటర్ల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. పెట్టుబడులు తిరిగి రాక నిర్మాతలు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఇతర ఆదాయ మార్గాలు కూడా అందుబాటులో లేకపోవడంతో పరిశ్రమలో అనిశ్చితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.'ఓ అందాల రాక్షసి'కి థియేటర్లేవీ?తన సినిమా 'ఓ అందాల రాక్షసి' విడుదల కోసం గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో థియేటర్లు లభించడం లేదని షిరాజ్ మెహదీ తెలిపారు. గత నాలుగైదేళ్లుగా చిన్న సినిమాలకు థియేటర్ల కేటాయింపు కష్టంగా మారిందని, హైదరాబాద్‌లోనూ పరిమిత సంఖ్యలో స్క్రీన్లు మాత్రమే లభిస్తున్నాయని ఆరోపించారు.

## 'కింగ్' న్యూ పోస్టర్..




**వుదయం సినిమా:** 'కింగ్' మూవీ నుంచి కొత్త పోస్టర్ రిలీజ్..యాక్షన్, ఇంటెన్సిటీతో పాటు రొమాన్స్ టచ్ ఉన్న లుక్‌తో షారూక్ ఖాన్ అదరగొడుతున్నారు. పెదాల మధ్య గులాబీ పువ్వు.. నిప్పులు చెరిగే కంటి చూపు.. ఇలా పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ 'కింగ్' కొత్త పోస్టర్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్. యాక్షన్, ఎమోషన్స్‌తో పాటు రొమాన్స్ టచ్‌తో రూపొందుతోన్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో షారుఖ్ ఎలా కనిపించబోతున్నారో ఈ పోస్టర్ ఓ చిన్న గ్లింప్స్ ఇచ్చింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాపై కొత్త పోస్టర్ మరింత అంచనాలను పెంచుతోంది.'కింగ్' కొత్త పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. భారీ యాక్షన్, పవర్‌ఫుల్ లుక్‌తో ఆకట్టుకుంటోన్న ఈ పోస్టర్.. వెండితెరపై షారుఖ్ ఖాన్‌ను సరికొత్త అవతార్‌లో చూడాలనే ఆసక్తిని అభిమానుల్లో మరింత పెంచుతోంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తోన్న 'కింగ్' చిత్రం డిసెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ ఎత్తున విడుదలవుతుంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.